PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR


నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 8 | పేజీలు : 8 | ఆదివారం 8 నవంబర్ 2026 | వెల : 2/-





మేడిగడ్డ వద్దే వారికి సరైన శిక్ష

- కాళేశ్వరం నిర్మాణంలో భారీ తప్పిదాలు
- పాలమూరును పట్టించుకోని గత ప్రభుత్వం
- భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.20 లక్షలు
- హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్
- ఈ నెల 9న కొడంగల్‌లో రూ.10 వేల కోట్ల పనులకు శ్రీకారం
- తాండూరు కందిపప్పుకు ప్రపంచ గుర్తింపు
- యాసంగిలో ఆరుతడి పంటలకే ప్రాధాన్యం
- ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ



కొడంగల్

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణకు, ముఖ్యంగా పాలమూరు ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ అందుబాటులో ఉన్నప్పటికీ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు. తెలంగాణకు వరప్రదాయనిగా మారాల్సిన ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి, దాని పేరు, స్థలం మార్చి, అంచనాలు పెంచి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలోనే నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కుప్పకూలిందని, దానికి బాధ్యత వహించాల్సిన నాయకులు ఇప్పుడు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో శనివారం నిర్వహించిన రైతుమేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం అగ్రి ఎక్స్‌పో స్టాళ్లను సందర్శించి వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక సాగు పద్ధతులను - మిగతా3లో



దక్షిణాదికి బుల్లెట్ రైలు కానుక

- బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 2 గంటల 10 నిమిషాలే!
- బెంగళూరు--చెన్నై మధ్య 73 నిమిషాలే
- ఏడు హైస్పీడ్ కారిడార్లకు కేంద్రం ప్రతిపాదన
- హైదరాబాద్--చెన్నై మధ్య 2 గంటల 55 నిమిషాలు
- రూ.16 లక్షల కోట్ల పెట్టుబడుల అంచనా
- 4 వేల కిలోమీటర్ల మేర హైస్పీడ్ నెట్‌వర్క్
- ఐటీ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు భారీ ప్రయోజనం

గాంధీ, నెహ్రూల స్థాయి మోదీకి ఎప్పటికీ రాదు!

- ప్రధాని మోదీపై అభిజీత్ దీప్కే తీవ్ర విమర్శలు..
- 120 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆ మహానేతలతో పోలిక సాధ్యం కాదు..
- ఎస్ఐఆర్‌పై పోరాటం ఆగదని స్పష్టీకరణ






ప్రజాస్వామ్యానికి బీజేపీ తీవ్ర నష్టం చేసింది..

- వ్యవస్థల పునరుద్ధరణకు సమష్టి కృషి అవసరం: సోనియా గాంధీ
- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత విమర్శలు..
- ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు..
- ఆత్మకథలో రాజీవ్‌తో అనుబంధం, రాజకీయ ప్రయాణం

ఎమర్జెన్సీపై కీలక వ్యాఖ్యలు..





చైనా క్షిపణులకు చెక్ పెట్టేందుకు అమెరికా మాస్టర్‌ప్లాన్

- రెండో ప్రపంచ యుద్ధం నాటి ఎయిర్‌బేస్‌లకు మళ్లీ కళ!
- పసిఫిక్‌లో నాలుగు ఎయిర్‌ఫీల్డ్‌ల విస్తరణకు అమెరికా ప్రతిపాదన
- రెండో ప్రపంచ యుద్ధం నాటి టినియన్ ఎయిర్‌బేస్ కూడా జాబితాలో
- ఏడాదికి 6,080 విమాన కార్యకలాపాలు నిర్వహించే అవకాశం
- ఒక్కో ప్రాంతంలో వెయ్యి మంది సైనికులతో విన్యాసాలు
- చైనా క్షిపణి దాడుల ముప్పును ఎదుర్కొనేందుకు ఏసీఈ వ్యూహం

నాలుగు నగరాలకు ఇందిరమ్మ టవర్స్!

- వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండలో నిర్మాణాలు
- నాలుగు కార్పొరేషన్లకు ఇందిరమ్మ టవర్స్
- ఇక వరంగల్‌లోనూ ఇందిరమ్మ టవర్స్
- ఇందిరమ్మ టవర్స్ విస్తరణకు సర్కారు సిద్ధం
- త్వరలోనే ఇందిరమ్మ టవర్స్ నోటిఫికేషన్
- మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ ఇళ్లు
- పేదలకు బహుళ అంతస్తుల ఇళ్లు
- నాలుగు నగరాల్లో 480 ఇళ్ల చొప్పున నిర్మాణం



హైదరాబాద్

రాష్ట్రంలోని పేద, అల్పాదాయ వర్గాల సొంతింటి కలను నెరవేర్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ గృహ నిర్మాణ పథకాన్ని రాష్ట్రంలోని మరో నాలుగు ప్రధాన నగరాలకు విస్తరించాలని నిర్ణయించింది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్లలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఒక్కో కార్పొరేషన్‌లో 480 ప్లాట్ల చొప్పున నిర్మించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్‌ను పది అంతస్తుల్లో నిర్మిస్తుండగా, మిగిలిన నాలుగు నగరాల్లో జీ+5 - మిగతా3లో

చమురు శుద్ధిలో భారత్ దూకుడు

- అమెరికా, యూరప్‌పై వ్యూహాత్మక ఆధిక్యం
- చమురు శుద్ధి సామర్థ్యంలో భారత్‌కు ప్రపంచంలో నాలుగో స్థానం
- ఏడాదికి 267.1 మిలియన్ టన్నుల ప్రస్తుత సామర్థ్యం
- 2030 నాటికి 300 మిలియన్ టన్నుల లక్ష్యం
- ముడి చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపైనే ఆధారం
- ఆరు నెలల్లో పెట్రోలియం ఎగుమతుల విలువ 27.2 బిలియన్ డాలర్లు



నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
8 నవంబర్ 2026

ప్రజాస్వామ్యానికి బీజేపీ తీవ్ర నష్టం చేసింది

న్యూఢిల్లీ : దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థలు, దేశ మౌలిక స్వరూపం గత 12 ఏళ్లలో తీవ్రంగా దెబ్బతిన్నాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచిందని విమర్శించారు. ప్రజలు ఈ పరిణామాలను క్రమంగా గుర్తిస్తున్నారని, భవిష్యత్తులో ప్రజాస్వామ్యాన్ని, సుపరిపాలనను పునరుద్ధరించేందుకు రాజకీయ పార్టీలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తన తాజా ఇంటర్వ్యూలో బీజేపీ ప్రభుత్వ పాలన, కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తు, 1975 ఎమర్జెన్సీ, తన వ్యక్తిగత జీవితం, త్వరలో విడుదల కానున్న ఆత్మకథకు సంబంధించిన పలు అంశాలపై ఆమె స్పందించారు.



ప్రజాస్వామ్య వ్యవస్థలకు తీవ్ర నష్టం

గత పన్నెండేళ్లలో దేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ సంస్థలకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో నుంచి వెళ్లిపోయిన తర్వాత కూడా వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడం అంత సులభం కాదన్నారు. ఇందుకు సమయం, రాజకీయ పార్టీల నుంచి గట్టి ప్రయత్నం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజల్లో అసహనం పెరుగుతోందని, దేశంలో జరుగుతున్న పరిణామాలను వారు అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. అయినప్పటికీ దేశ భవిష్యత్తుపై తనకు ఆశావాదం ఉందని, ప్రజలు తిరిగి మెరుగైన పాలనను స్వాగతిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేవు

కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తుపై స్పందిస్తూ తాను నిరాశావాదంతో లేనని సోనియా తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలకు సమాన అవకాశాలు లభించడం లేదని ఆరోపించారు. ఎన్నికల సంఘం సహా కీలక వ్యవస్థలపై అధికార పార్టీ ప్రభావం ఉందని, ప్రధాన స్రవంతి మీడియా, ఆర్థిక బలం, మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం వంటి అంశాలు ఎన్నికల పోటీలో అసమానతలకు కారణమవుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అనేక రకాల వేధింపులు ఎదుర్కొంటున్నప్పటికీ గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం పోరాడుతున్నాయని చెప్పారు. ఇటీవలి కాలంలో పలు ఎన్నికల్లో అక్రమాలు, ఓట్ల చోరీ జరిగాయనే అంశాలు వెలుగులోకి వచ్చాయని ఆరోపిస్తూ, ప్రజలు కూడా వీటిని గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి కాంగ్రెస్ ముందుకు సాగుతోందని, పార్టీ విజయావకాశాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.

ఎమర్జెన్సీపై ఇందిర నిర్ణయాన్ని సమర్థించిన సోనియా

1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీపై కూడా సోనియా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో ప్రజాస్వామ్య హక్కులు పరిమితమైనప్పటికీ, ఇందిరా గాంధీ అనంతరం పరిస్థితులను సమీక్షించి ప్రజాస్వామ్య ప్రక్రియకు తిరిగి వచ్చారని గుర్తుచేశారు. ఎమర్జెన్సీ సమయంలో హేబియస్ కార్పస్ హక్కును కూడా నిలిపివేశారని అంగీకరించారు. అయితే అప్పటి పరిస్థితుల్లో హింసాత్మక నిరసనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థలపై దాడులు, అశాంతి వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని వివరించారు. 1977 మార్చిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఇందిర నిర్ణయం తీసుకున్నారని, ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అకృత్యాలపై ఆ తర్వాత బహిరంగంగా విచారం వ్యక్తం చేసి క్షమాపణలు చెప్పారని సోనియా వెల్లడించారు.

నవంబర్ 10న ఆత్మకథ విడుదల

తన జీవితంలోని అనేక ఆసక్తికర విషయాలను 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే ఆత్మకథలో పొందుపరిచినట్లు సోనియా తెలిపారు. నవంబర్ 10న ఈ పుస్తకం విడుదల కానుంది. యుద్ధానంతర ఇటలీలో తన బాల్యం, రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, గాంధీ కుటుంబంతో ఏర్పడిన అనుబంధం, భారతీయ సంస్కృతిని అలవర్చుకున్న తీరు వంటి అంశాలను ఇందులో వివరించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో తన అనుబంధం, ఆయన కుటుంబం పట్ల ప్రేమ, భారతదేశంతో తనకు ఏర్పడిన అనుబంధం ఈ పుస్తకంలో ప్రధానంగా ఉంటాయని చెప్పారు.

కుటుంబ త్యాగాలే రాజకీయాల్లోకి వచ్చేలా చేశాయి

గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు, ఆ త్యాగాల వెనుక ఉన్న లక్ష్యాలకు ఎదురవుతున్న ముప్పు, కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతున్న పరిస్థితులు తనను ప్రజా జీవితంలోకి అడుగుపెట్టేలా చేశాయని సోనియా వెల్లడించారు. ఇంతకాలం తన వ్యక్తిగత జీవిత విశేషాలను బహిరంగంగా పంచుకోవడానికి ఆసక్తి చూపలేదని, ఇప్పుడు తన జీవిత ప్రయాణాన్ని పుస్తక రూపంలో ప్రజల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధాని పదవిని స్వీకరించకపోవడంపై కూడా స్పందించారు. అప్పటి ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా, తాను పార్టీ నాయకురాలిగా వేర్వేరు బాధ్యతలు నిర్వహించామని, ఆ అనుభవం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు.

సోనియా వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడి

సోనియా గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు కూడా స్పందించారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య హక్కులను అణచివేసిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకోవాలని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ హితవు పలికారు. అప్పట్లో వేలాది మంది ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పెట్టారని, జర్నలిస్టుల గొంతుకలను నొక్కేశారని విమర్శించారు. దీంతో ప్రజాస్వామ్య పరిరక్షణ అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ విమర్శలు మరోసారి వేడెక్కాయి.

చైనా క్షిపణులకు చెక్ పెట్టేందుకు అమెరికా మాస్టర్‌ప్లాన్

చైనా క్షిపణి సామర్థ్యం పెరుగుతుండటంతో అమెరికా తన సైనిక వ్యూహాన్ని మార్చుకుంటోంది. పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలో వైమానిక కార్యకలాపాలను విస్తరించేందుకు రెండో ప్రపంచ యుద్ధం సమయంలో కీలకంగా పనిచేసిన విమానాశ్రయాలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇందులో జపాన్‌పై అణుబాంబు దాడులకు అమెరికా బాంబర్ విమానాలు ఉపయోగించిన టినియన్ దీవిలోని చారిత్రక ఎయిర్‌బేస్ కూడా ఉంది. కామన్‌వెల్త్ ఆఫ్ నార్తర్న్ మరియానా దీవుల పరిధిలోని నాలుగు ఎయిర్‌ఫీల్డ్‌ల లో సైనిక శిక్షణ, విమానాల రాకపోకలు, సరకు రవాణా కార్యకలాపాలను పెంచాలని అమెరికా వైమానిక దళం ప్రతిపాదించింది. అక్టోబర్ 28న అమెరికా వైమానిక దళ విభాగం విడుదల చేసిన నోటీసులో ఈ ప్రణాళిక వివరాలను వెల్లడించింది. ఈ నాలుగు ప్రాంతాల్లో ఏడాదికి మొత్తం 6,080 విమాన కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రతిపాదన ప్రకారం.. ఒక్కో ఎయిర్‌ఫీల్డ్‌లో ఏడాదికి 1,200 స్థిర రెక్కల విమానాల కార్యకలాపాలు, 320 హెలికాప్టర్ కార్యకలాపాలు చేపట్టవచ్చు. మరో ప్రత్యామ్నాయ ప్రణాళికలో ఈ సంఖ్యను వరుసగా 1,400, 384కు పెంచే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. ఈ విన్యాసాల్లో గరిష్ఠంగా వెయ్యి మంది సైనికులు పాల్గొనవచ్చు. ఒక్కో ప్రాంతంలో 5.5 లక్షల గ్యాలన్ల వరకు ఇంధనం అవసరమవుతుందని అంచనా. తాత్కాలిక సైనిక వసతులు, విమానాల మరమ్మతులు, రవాణా ఏర్పాట్లతో పాటు రక్షణ చర్యల్లో భాగంగా చాఫ్, ఫ్లేర్స్ వినియోగం కూడా ఈ కార్యకలాపాల్లో భాగం కానుంది.



చైనా క్షిపణి ముప్పే ప్రధాన కారణం

చైనా సైనిక సామర్థ్యం, ముఖ్యంగా దాని క్షిపణి వ్యవస్థల విస్తరణ నేపథ్యంలో అమెరికా ఈ చర్యలకు సిద్ధమవుతోంది. ఒకే సైనిక స్థావరంపై ఆధారపడకుండా విమానాలు, సిబ్బంది, పరికరాలను పలు ప్రాంతాలకు విస్తరించడమే అమెరికా వైమానిక దళం అనుసరిస్తున్న 'ఏజైల్ కాంబాట్ ఎంప్లాయ్‌మెంట్' (ఏసీఈ) వ్యూహం ముఖ్య ఉద్దేశం. శత్రుదేశం ఒక ప్రధాన స్థావరంపై దాడి చేసినా మిగిలిన ప్రాంతాల నుంచి కార్యకలాపాలు కొనసాగించేలా ఈ విధానం ఉపయోగపడుతుంది. తైవాన్ చుట్టూ యుద్ధ పరిస్థితులు తలెత్తితే పశ్చిమ పసిఫిక్‌లోని అమెరికా సైనిక స్థావరాలు చైనా క్షిపణులకు లక్ష్యంగా మారే ప్రమాదం ఉందని వాషింగ్టన్ ఆందోళన చెందుతోంది. గువామ్‌లోని ఆండర్సన్ వైమానిక స్థావరం అమెరికా కార్యకలాపాలకు కీలకం. అక్కడి రన్‌వేలు, ఇంధన నిల్వలు, రవాణా వ్యవస్థలకు నష్టం వాటిల్లితే యుద్ధ సమయంలో విమానాల మోహరింపు కష్టమవుతుంది. గువామ్‌కు ఉత్తరాన 100 నాటికల్ మైళ్లలోపే ఉన్న నార్తర్న్ మరియానా దీవులు ఈ సమస్యకు ప్రత్యామ్నాయంగా మారవచ్చని అమెరికా భావిస్తోంది. వాణిజ్య విమానాశ్రయాల నుంచి తాత్కాలిక ఏర్పాట్లతో పనిచేసే ప్రాంతాల వరకు భిన్నమైన వాతావరణాల్లో సైనిక కార్యకలాపాలను పరీక్షించేందుకు ఈ నాలుగు ఎయిర్‌ఫీల్డ్‌లు ఉపయోగపడనున్నాయి. ఈ ప్రణాళిక ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తన వైమానిక బలగాల మోహరింపును మరింత విస్తరించాలని అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది.

ఆకాశమే హద్దుగా.. 13,629 అడుగుల ఎత్తులో భారత వాయుసేన ప్రపంచ రికార్డు

లడఖ్‌లో భారత వాయుసేన చారిత్రక ఘనత

13,629 అడుగుల ఎత్తులో ఐఎల్-76ఎండీ ల్యాండింగ్

న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో విజయవంతంగా దిగిన విమానం

ఈ తరహా విమానానికి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ల్యాండింగ్

ఎల్ఏసీకి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఎయిర్‌ఫీల్డ్

తక్కువ గాలి సాంద్రతలో ల్యాండింగ్ చేయడం సవాలు

లడఖ్‌లో భారత వాయుసేన అరుదైన ఘనత సాధించింది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో భారీ విమానాలను నడిపే సామర్థ్యాన్ని చాటుతూ.. ఐఎల్-76ఎండీ రవాణా విమానాన్ని 13,629 అడుగుల ఎత్తులో విజయవంతంగా ల్యాండ్ చేసింది. తూర్పు లడఖ్‌లోని న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ఈ చారిత్రక ల్యాండింగ్ జరిగింది. ప్రపంచంలో ఈ తరహా విమానానికి ఇదే అత్యంత ఎత్తులో జరిగిన ల్యాండింగ్ అని భారత వాయుసేన ప్రకటించింది.

ఈ ఘనతకు సంబంధించిన ఫొటోలు, వీడియోను వాయుసేన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. విమానం సామర్థ్యంతోపాటు సిబ్బంది నైపుణ్యం, కచ్చితత్వం, వృత్తి నైపుణ్యానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొంది. దేశ వ్యూహాత్మక రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక ముందడుగుగా అభివర్ణించింది. చైనా సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ ఉంది. సరిహద్దుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో సైనికపరంగా దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి ఎత్తైన ప్రాంతాల్లో గాలి సాంద్రత తక్కువగా ఉంటుంది. దీంతో విమానాలకు ఇంజిన్ పనితీరు, గాల్లోకి లేచే సామర్థ్యం తగ్గుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారీ రవాణా విమానాన్ని సురక్షితంగా దించడం సవాలుతో కూడుకున్న పని. రష్యా మూలాలున్న ఐఎల్-76ఎండీ నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, ఇతర భారీ సరకులను మారుమూల ప్రాంతాలకు తరలించేందుకు వాయుసేన దీన్ని వినియోగిస్తోంది. న్యోమాలో ఈ విమానం ల్యాండింగ్ కావడం సరిహద్దు ప్రాంతాల్లో సైనిక అవసరాలకు వేగంగా స్పందించే భారత సామర్థ్యాన్ని చాటిందని రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.



గాంధీ, నెహ్రూల స్థాయి మోదీకి ఎప్పటికీ రాదు!

కొచ్చి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ ప్రభుత్వంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూలతో పోలిస్తే మోదీ స్థాయి ఎప్పటికీ సరిపోదని వ్యాఖ్యానించారు. మోదీ మరో 120 ఏళ్లు అధికారంలో కొనసాగినా ఆ మహానేతలు దేశానికి చేసిన సేవలకు సమానమైన సేవలు చేయలేరని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న భావజాల సంస్థ పాత్రపై కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారు.



శనివారం కేరళలోని కొచ్చిలో నిర్వహించిన 'జంతర్ మంతర్ ఎట్ కొచ్చి' నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గాంధీ దేశ ఆత్మ.. అంబేద్కర్ వెన్నెముక

మహాత్మా గాంధీని భారతదేశ ఆత్మగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను దేశ వెన్నెముకగా, జవహర్‌లాల్ నెహ్రూను దేశ మేధస్సుగా అభిజీత్ దీప్కే అభివర్ణించారు. ఈ ముగ్గురు మహానేతలు దేశ నిర్మాణానికి చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న భావజాల సంస్థ ఎలాంటి పాత్ర పోషించలేదని, వలస పాలకులకు సేవ చేయడానికే పరిమితమైందని ఆరోపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహానేతలు పోరాడుతుంటే, అప్పటి ఆ సంస్థ బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా వ్యవహరించిందని విమర్శించారు.

ఓటు హక్కును హరిస్తున్నారా?

ప్రజల ఓటు హక్కును నియంత్రించేందుకు ప్రధాని మోదీ, బీజేపీ ప్రయత్నిస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. స్వతంత్ర, నిష్పక్షపాత ఎన్నికల వ్యవస్థ ఏర్పడే వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

త్రివర్ణ పతాకం ఎగురవేస్తూనే ఉంటా

త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినందుకు తనను, తన ఇద్దరు సోదరులను జైలులో పెట్టారని అభిజీత్ దీప్కే వెల్లడించారు. దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ జాతీయ జెండాను ఎగురవేస్తానని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని ప్రకటించారు. తనను ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు సహా దేశంలోని ఏ ప్రాంతంలోనైనా అరెస్టు చేసుకోవచ్చని సవాల్ విసిరారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా మళ్లీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తానని స్పష్టం చేశారు.

ప్రకాశ్ రాజ్ ఆహ్వానంతో కొచ్చికి

కేరళలోని కొచ్చిలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి స్థానిక నిర్వాహకులతో పాటు ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ తనను ఆహ్వానించారని దీప్కే తెలిపారు. వారి ఆహ్వానం మేరకే తాను కొచ్చికి వచ్చినట్లు చెప్పారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగే వరకు ఎస్ఐఆర్‌పై తమ ఉద్యమం కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణే తమ ఉద్యమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

చమురు శుద్ధిలో భారత్ దూకుడు..

ముడి చమురు అవసరాల్లో దాదాపు 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న భారత్.. శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో మాత్రం ప్రపంచంలో కీలక శక్తిగా ఎదుగుతోంది. అమెరికా, ఐరోపా దేశాలు చమురు శుద్ధి సామర్థ్యాన్ని తగ్గించుకుంటుంటే.. భారత్ మాత్రం దాన్ని విస్తరిస్తోంది. దీంతో అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో దేశానికి వ్యూహాత్మక ఆధిక్యం లభిస్తోందని 'ఇండియా నెరేటివ్' కథనం విశ్లేషించింది. 2026 ఏప్రిల్ నాటికి భారత్ చమురు శుద్ధి సామర్థ్యం ఏడాదికి 267.1 మిలియన్ టన్నులుగా ఉంది. రోజుకు సుమారు 53 నుంచి 56 లక్షల బ్యారెళ్లకు సమానమైన ఈ సామర్థ్యంతో ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా, రష్యా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 2030 నాటికి శుద్ధి సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీర్ఘకాలంలో 400 మిలియన్ టన్నులకు చేర్చాలని భావిస్తోంది. భారత్ రోజుకు 54 నుంచి 56 లక్షల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇందులో రష్యా వాటా ఇటీవల 18 నుంచి 20 లక్షల బ్యారెళ్లుగా ఉంది. మొత్తం దిగుమతుల్లో ఇది దాదాపు 35 శాతం. గతంలో ఈ వాటా 50 శాతాన్ని దాటిన సందర్భాలున్నాయి. ధరల ఆధారంగా భారత్ కొనుగోళ్ల నిర్ణయాలు తీసుకుంటోందని కథనం పేర్కొంది. మరోవైపు శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా భారత్‌కు భారీ ఆదాయం వస్తోంది. 2026 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల్లో ఈ ఎగుమతుల విలువ 27.2 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో డీజిల్ వాటా 12.6 బిలియన్ డాలర్లు. సెప్టెంబర్‌లో రోజుకు సుమారు 6.2 లక్షల బ్యారెళ్ల డీజిల్‌ను భారత్ ఎగుమతి చేసింది. ఇందులో దాదాపు సగం ఐరోపా దేశాలకే వెళ్లింది. రష్యా ఉత్పత్తులపై పరిమితులు, ఐరోపాలో రిఫైనరీల మూసివేత, మధ్యప్రాచ్యంలో నిర్వహణ పనుల కారణంగా ఏర్పడిన కొరతను భారత ఎగుమతులు కొంతవరకు భర్తీ చేస్తున్నాయి. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై అమెరికా ఆంక్షలు, సుంకాల ఒత్తిడి తెస్తున్నా.. భారత రిఫైనరీల్లో శుద్ధి చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన సరఫరాకు ఉపయోగపడుతున్నాయని కథనం విశ్లేషించింది. ఇంధన ధరలు పెరిగినప్పుడు అమెరికా కూడా కొన్ని ఆంక్షల విషయంలో మినహాయింపులు ఇచ్చిందని గుర్తుచేసింది. భారత్ రిఫైనింగ్ సామర్థ్యం పెరిగితే ప్రపంచ మార్కెట్‌లో సరఫరా సమతుల్యతను ప్రభావితం చేసే స్థాయిలో దేశం నిలుస్తుందని పేర్కొంది.



ఈ20 పేరుతో ప్రజలకు 420 మోసం చేస్తున్నారా?

న్యూఢిల్లీ : దేశంలో ఈ20 పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం అంశం రాజకీయ దుమారం రేపుతోంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాల్సి ఉండగా, అంతకుమించి మిశ్రమం చేస్తున్న చమురు కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కర్ణాటకలో నిర్వహించిన పరీక్షల్లో పలు పెట్రోల్ నమూనాల్లో నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ ఉన్నట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై శనివారం ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. మరోవైపు, రాహుల్ ఆరోపణలను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఖండించడంతో ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ20 కాస్త 420గా మారింది!

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలుపుతున్నామని కేంద్రం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో పరీక్షించగా, 11 నమూనాల్లో ఇథనాల్ శాతం 20 శాతానికి మించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని వెల్లడించారు. భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), నయారా, షెల్ సంస్థలపైనా ఆరోపణలు చేశారు. ఈ20 పేరుతో విక్రయిస్తున్న ఇంధనం 420గా మారిందంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అధిక శాతం ఇథనాల్ కలిగిన పెట్రోల్ వల్ల వాహనదారులు నష్టపోతున్నారని రాహుల్ విమర్శించారు. ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకునే సామర్థ్యం లేని వాహనాల్లో ఈ ఇంధనాన్ని వినియోగిస్తే ఇంజిన్ పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మైలేజీ తగ్గడంతో పాటు వాహనాల నిర్వహణ, మరమ్మతుల ఖర్చులు పెరుగుతాయని ఆరోపించారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
8 నవంబర్ 2026

మేడిగడ్డ వద్దే వారికి సరైన శిక్ష

-మొదటిపేజీ తరువాయి

పరిశీలించారు. బహిరంగ సభలో ప్రసంగించిన సీఎం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయం, సాగునీటి వినియోగం, భవిష్యత్తు పంటల ప్రణాళికపై మాట్లాడారు.

కట్టామని గొప్పలు.. కూలితే బాధ్యత లేదా?

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తామే గొప్పగా నిర్మించామని చెప్పుకున్న బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడంతో బాధ్యత తీసుకోవడం లేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును పక్కనుండి నిర్మించానని హరీశ్‌రావు గొప్పలు చెప్పుకున్నారని, తన పేరు హరీశ్‌రావు కాదని, కాళేశ్వరరావు అని చెప్పుకునే స్థాయిలో ప్రచారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు నిల్వ చేయలేని పరిస్థితి ఏర్పడితే కన్నెపల్లి పంపులు ఎలా పనిచేస్తాయని ప్రశ్నించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ నీటిని నిల్వ చేయలేని దుస్థితి నెలకొందన్నారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటే అసలు ఆ బ్యారేజీని ఎందుకు నిర్మించారని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మేడిగడ్డ వద్ద వారిని పాతిపెట్టడమే సరైన శిక్ష అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

పాలమూరును పదేళ్లు పట్టించుకోలేదు

గత పదేళ్లలో పాలమూరు జిల్లాను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గానికి నీళ్లు, నిధులు, ప్రాజెక్టులు అందించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోతున్న రైతులకు తమ ప్రభుత్వం ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందిస్తోందని, గతంలో ఎకరాకు రూ.2 లక్షలు ఇవ్వడానికి కూడా అప్పటి ప్రభుత్వానికి మనసు



రాలేదని విమర్శించారు. కొడంగల్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కొందరు తమ పత్రికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నామని, మూడేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

లగచర్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

లగచర్ల విషయంలోనూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేసి రైతులను భయభ్రాంతులకు గురిచేశాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఢిల్లీ, నొయిడా తరహాలో హైదరాబాద్--లగచర్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. లగచర్లలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద పెద్ద కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. హకీంపేటలో సుమారు 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఉన్నత విద్యాసంస్థలన్నీ ఒకే ప్రాంతంలో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ నెల 9న కొడంగల్‌లో రూ.10 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

తాండూరు కందిపప్పుకు అంతర్జాతీయ గుర్తింపు

తాండూరు కందిపప్పు నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి కొనియాడారు. ఇప్పటికే తాండూరు కందిపప్పు అనేక దేశాలకు ఎగుమతి అవుతోందని, ఈ ప్రాంత రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు మరింత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ విమర్శల్లో భాగంగా కేటీఆర్‌పై కూడా సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. వేషాలు మార్చినంత మాత్రాన కేటీఆర్ ఎప్పటికీ రేవంత్‌రెడ్డి కాలేరని అన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ కుటుంబం చేసిన తప్పులను ఎప్పటికీ మర్చిపోరని వ్యాఖ్యానించారు. ఇసుక వ్యాపారానికి అడ్డుగా ఉన్నారని నేరెళ్ల దళితులను వేధించిన ఘటనను, గిట్టుబాటు ధర అడిగిన రైతులకు ఖమ్మంలో బేడీలు వేసిన ఘటనను ప్రజలు ఇంకా గుర్తుంచుకున్నారని పేర్కొన్నారు.

ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి

రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నాయని, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, అయితే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. జులై వరకు వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే అంచనాల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేతల మాటలు నమ్మి రైతులు నష్టపోవద్దని అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు, అధికారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమకు ఓటు వేయలేదనే కారణంతో కేసీఆర్ కుటుంబం వారిపై కక్ష పెంచుకుందని, అబద్ధపు ప్రచారంతో ప్రజలను గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తోందని సీఎం ఆరోపించారు. రైతుల సంక్షేమం, సాగునీటి వినియోగం, ప్రాంతీయ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

నాలుగు నగరాలకు ఇందిరమ్మ టవర్స్!

-మొదటిపేజీ తరువాయి

అంతస్తుల విధానంలో నిర్మించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో అనువైన స్థలాల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో టవర్స్ నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించడంపై వరంగల్, హనుమకొండ జిల్లాల రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ వరంగల్‌లో విలీనమైన 42 గ్రామాల పరిధిలోని అర్హులకు ఈ పథకం వర్తించే అవకాశం ఉంది. స్థలాన్ని ప్రభుత్వం ఉచితంగా కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల వరకు రాయితీ అందించనుంది. మిగిలిన నిర్మాణ వ్యయాన్ని లబ్ధిదారులే భరించాల్సి ఉంటుంది.

30 వేలకు పైగా దరఖాస్తులు

గ్రేటర్ వరంగల్ పరిధిలో రెండు పడక గదుల ఇళ్ల కోసం ఇప్పటికే 30 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో చాలామంది ఇందిరమ్మ ఇళ్ల పథకంలోని ఎల్-2 జాబితాలో ఉన్నారు. ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది లబ్ధిదారులు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు.

నిబంధనల ప్రకారం ఇంటింటి సర్వే నిర్వహిస్తే వీరిలో 10 వేల నుంచి 12 వేల మంది వరకు అర్హులుగా గుర్తించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే దూపకుంటలో 2 వేల ఇళ్లు, తిమ్మాపూర్‌లో 320, దేశాయిపేటలో 200, పైడిపల్లిలో 70 ఇళ్లు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. గత ఏడాది నుంచి లబ్ధిదారులు ఇళ్ల కేటాయింపు కోసం ఎదురుచూస్తున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఇళ్ల పంపిణీ ప్రక్రియ పలుమార్లు వాయిదా పడటంతో ఆశావహుల్లో నిరీక్షణ కొనసాగుతోంది.



లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటి సర్వే కూడా పూర్తయినట్లు తెలుస్తోంది.

దీపావళిలోగా నోటిఫికేషన్?

ఇందిరమ్మ టవర్స్ పథకానికి సంబంధించి అర్హతలు, లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలను అధికారులు ఖరారు చేస్తున్నారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి, మిగిలిన నాలుగు కార్పొరేషన్లకు అనుగుణంగా మార్పులు చేయాలని భావిస్తున్నారు. క్యూర్ పరిధిలో ఒక్కో లబ్ధిదారుడు రూ.6 లక్షల వరకు వాటా చెల్లించే విధానం ఉండగా, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండల్లో లబ్ధిదారుల వాటాను కొంత తగ్గించే అవకాశముందని సమాచారం. ఈ నాలుగు నగరాల్లో స్థలాల గుర్తింపు, అర్హతల ఖరారు, ఇతర పరిపాలనాపరమైన ప్రక్రియలు పూర్తయిన తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు పెరిగాయి. ఈ నగరాల్లో పథకం అమలు పూర్తయిన తర్వాత రాష్ట్రంలోని ఇతర జిల్లా కేంద్రాలకు కూడా ఇందిరమ్మ టవర్స్ పథకాన్ని విస్తరించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించనుంది. పట్టణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేని అల్పాదాయ కుటుంబాలకు అందుబాటు ధరలో గృహవసతి కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. నోటిఫికేషన్ విడుదలైతే అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు మార్గం సుగమం కానుంది.

దక్షిణాదికి బుల్లెట్ రైలు కానుక

న్యూఢిల్లీ: దక్షిణ భారతదేశంలో రైల్వే ప్రయాణ ముఖచిత్రం మారనుంది. ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేలా హైస్పీడ్ రైలు కారిడార్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బెంగళూరు, హైదరాబాద్, అమరావతి, చెన్నై నగరాలను అనుసంధానించే దక్షిణాది బుల్లెట్ రైలు కారిడార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆమోదం తెలిపినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. నవంబర్ 1న బెంగళూరు--ముంబై వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వివరాలు ప్రకటించారు. ఈ హైస్పీడ్ రైలు కారిడార్ అందుబాటులోకి వస్తే బెంగళూరు--హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం సుమారు 2 గంటల 10 నిమిషాలకు తగ్గనుంది. బెంగళూరు--చెన్నై మధ్య ప్రయాణానికి కేవలం 73 నిమిషాలే పట్టనుంది. దీంతో ఐటీ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో కీలకంగా ఉన్న ఈ నగరాల మధ్య రాకపోకలు మరింత వేగవంతం కానున్నాయి. అయితే ప్రాజెక్టు నిర్మాణం, తుది మార్గం, స్టేషన్లు, పనుల ప్రారంభం, పూర్తయ్యే తేదీలపై మరిన్ని అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

దక్షిణాదిలో హైస్పీడ్ రైలు నెట్‌వర్క్

బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాలను అనుసంధానించడం ద్వారా దక్షిణ భారతదేశంలో సమగ్ర ఆర్థిక ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కేంద్రం భావిస్తోంది. ఈ నగరాల మధ్య వేగవంతమైన రవాణా సదుపాయాలు ఏర్పడితే ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు మధ్య ఐటీ, స్టార్టప్, ఫార్మా, కార్పొరేట్ రంగాల్లో ఇప్పటికే ఉన్న వ్యాపార సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. చెన్నైలోని ఆటోమొబైల్, తయారీ పరిశ్రమలకు బెంగళూరులోని సాంకేతిక, కార్పొరేట్ రంగాలతో వేగవంతమైన అనుసంధానం ఏర్పడుతుంది.



అలాగే హైదరాబాద్ నుంచి కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది.

ఏడు హైస్పీడ్ కారిడార్లకు బడ్జెట్‌లో ప్రతిపాదన

2026-27 కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైలు కారిడార్ల అభివృద్ధిని కేంద్రం ప్రకటించింది. వీటిని ప్రధాన నగరాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే కనెక్టర్లుగా రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం సుమారు 4,000 కిలోమీటర్ల మేర ఈ కారిడార్లు విస్తరించనున్నాయి. వీటి ద్వారా దాదాపు రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేస్తోంది.

ప్రతిపాదించిన ఏడు కారిడార్లు ఇవే:

ముంబై-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగురి ఈ మార్గాల్లో ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంచనా ప్రయాణ సమయాల ప్రకారం పుణె-హైదరాబాద్ మధ్య 1 గంట 55 నిమిషాలు, హైదరాబాద్-చెన్నై మధ్య 2 గంటల 55 నిమిషాలు, ముంబై-పుణె మధ్య 48 నిమిషాలు, ఢిల్లీ--వారణాసి మధ్య 3 గంటల 50 నిమిషాలు, వారణాసి--సిలిగురి మధ్య 2 గంటల 55 నిమిషాలు పట్టే అవకాశం ఉంది.

ఇప్పటికే నిర్మాణంలో ముంబై--అహ్మదాబాద్ బుల్లెట్ రైలు

భారతదేశపు తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టుగా ముంబై--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం కొనసాగుతోంది. సుమారు 508 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టును గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో రైళ్లు నడిచేలా రూపొందిస్తున్నారు. ఈ మార్గంలో మొత్తం 12 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. మహారాష్ట్రలో నాలుగు, గుజరాత్‌లో ఎనిమిది స్టేషన్లు ఉండనున్నాయి.

ఆర్థిక రంగానికి కొత్త ఊతం

హైస్పీడ్ రైలు కారిడార్లు అందుబాటులోకి వస్తే నగరాల మధ్య దూరం తగ్గడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం కానున్నాయి. ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పెరగడంతో పాటు పారిశ్రామిక పెట్టుబడులకు కూడా ప్రోత్సాహం లభించనుంది. ముఖ్యంగా హైదరాబాద్--బెంగళూరు మధ్య వేగవంతమైన రైలు కనెక్టివిటీ ఏర్పడితే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత విస్తరించే అవకాశం ఉంది. దక్షిణాదిలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతి నగరాలు మరింత చేరువ కావడంతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయి.

ఎమ్మెల్సీ ఓటు కోసం పట్టభద్రుల క్యూ!

-మొదటిపేజీ తరువాయి

1,51,596 దరఖాస్తులు వచ్చాయి. మేడ్చల్-మల్కాజిగిరిలో 1,41,808, హైదరాబాద్‌లో 1,04,349 మంది ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 45,611, నాగర్‌కర్నూలులో 43,667, వికారాబాద్‌లో 40,147, వనపర్తిలో 29,155, జోగులాంబ గద్వాలలో 22,974, నారాయణపేటలో 20,087 దరఖాస్తులు అందాయి. ఈ నియోజకవర్గంలో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉండగా, నారాయణ పేటలో అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి.

వరంగల్-ఖమ్మం-నల్గొండకు 6.70 లక్షలు

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి మొత్తం 6,70,367 ఫామ్-18 దరఖాస్తులు అందాయి. జిల్లాలవారీగా నల్గొండలో అత్యధికంగా 1,14,525 దరఖాస్తులు వచ్చాయి. ఖమ్మంలో 1,09,971, సూర్యాపేటలో 73,990, హనుమకొండలో 68,056, వరంగల్‌లో 66,957, భద్రాద్రి కొత్తగూడెంలో 57,370, మహబూబాబాద్‌లో 53,718, యాదాద్రి భువనగిరిలో 49,789, జనగామలో 35,418 దరఖాస్తులు అందాయి. జయశంకర్ భూపాలపల్లిలో 17,907, ములుగులో 15,337, సిద్దిపేటలో 7,329 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ నియోజకవర్గంలో సిద్దిపేట జిల్లా అత్యల్ప దరఖాస్తులతో చివరి స్థానంలో నిలిచింది.

గత ఎన్నికల కంటే పెరిగిన స్పందన

2021 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో 5,76,462 దరఖాస్తులు అందగా, ఈసారి 5,99,394కు పెరిగాయి. అంటే గతంతో పోలిస్తే 22,932 దరఖాస్తులు అదనంగా వచ్చాయి. వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గంలో గత ఎన్నికలప్పుడు 5,63,282 దరఖాస్తులు రాగా, ఈసారి 6,70,367కు చేరాయి. గతంతో పోలిస్తే 1,07,085 దరఖాస్తులు పెరిగాయి. రెండు నియోజకవర్గాలను కలిపి చూస్తే గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి 1,30,017 దరఖాస్తులు అధికంగా అందాయి.

పరిశీలనలో మందకొడి.. ఆమోదం పొందినవి 3.49 లక్షలే

దరఖాస్తుల స్వీకరణ ముగిసినప్పటికీ వాటి పరిశీలన ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,15,350 దరఖాస్తులు మాత్రమే ఆమోదం పొందాయి. వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గంలో 2,33,861 దరఖాస్తులకు ఆమోదం లభించింది. రెండు నియోజకవర్గాల్లో కలిపి 3,49,211 దరఖాస్తులు మాత్రమే ఆమోదం పొందగా, మిగిలిన వాటి పరిశీలన కొనసాగుతోంది.

నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితా

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, జాబితా రూపకల్పనకు సంబంధించి ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నెల 25న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. ఈ సమయంలో కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు కూడా అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

డిసెంబర్ 30న తుది జాబితా

అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిశీలన అనంతరం డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. అయితే ఆ తర్వాత కూడా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని సీఈవో స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు నిర్ణయించిన చివరి తేదీ వరకు అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దీంతో ప్రస్తుతం దరఖాస్తు చేయలేకపోయిన అర్హులైన పట్టభద్రులకు మరో అవకాశం అందుబాటులో ఉండనుంది.

11న తమ్మిడికుంట చెరువు ప్రారంభం

పునరుద్ధరించిన చెరువును ప్రారంభించనున్న సీఎం

ఏర్పాట్లను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్: మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు ఈ నెల 11న ప్రారంభం కానుంది. హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరించిన ఈ చెరువును ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. చెరువు పునరుద్ధరణ పనులు, పరిసరాల అభివృద్ధి, ప్రారంభోత్సవానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. నగరంలోని చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, నీటి వనరుల పునరుద్ధరణ లక్ష్యంగా హైడ్రా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా తమ్మిడికుంట చెరువును అభివృద్ధి చేశారు. చెరువుల పూర్వ వైభవాన్ని తీసుకురావడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు ప్రారంభోత్సవ ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.

గంజాయి సామ్రాజ్యాన్ని నడిపిన మహిళా డాన్ అరెస్ట్!

30 కేసులు.. 13 కేసుల్లో పరారీ.. తొమ్మిదేళ్లుగా అక్రమ వ్యాపారం..

గంజాయి సొమ్ముతో భారీగా ఆస్తులు కూడబెట్టిందా? ఈగల్ ఫోర్స్ దర్యాప్తు

గంజాయి సామ్రాజ్యాన్ని నడిపిన మహిళా డాన్ అరెస్ట్!

హైదరాబాద్: తెలంగాణలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఈగల్ ఫోర్స్ మరో కీలక చర్య చేపట్టింది. గత తొమ్మిదేళ్లుగా గంజాయి అక్రమ వ్యాపారంలో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళను అరెస్టు చేసింది. నానక్‌రామ్‌గూడకు చెందిన 51 ఏళ్ల కలాపతి నీతూ బాయిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై, కుటుంబ సభ్యులపై 2017 నుంచి 2026 వరకు సుమారు 30 ఎన్‌డీపీఎస్, ఎక్సైజ్ కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. వీటిలో 13 కేసులకు సంబంధించి ఆమె పరారీలో ఉన్నట్లు తెలిపారు. గంజాయి విక్రయాల ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు అనుమానిస్తూ ఆర్థిక లావాదేవీలపై కూడా దర్యాప్తు చేస్తున్నారు.

30 కేసులు.. 13 కేసుల్లో పరారీ

పోలీసుల వివరాల ప్రకారం.. నీతూ బాయి, ఆమె కుటుంబ సభ్యులపై 2017 నుంచి 2026 మధ్య సుమారు 30 ఎన్‌డీపీఎస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 13 కేసుల్లో ఆమె పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో పలుమార్లు అరెస్టయి జ్యుడీషియల్ కస్టడీకి వెళ్లినప్పటికీ, బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత తిరిగి గంజాయి వ్యాపారాన్ని కొనసాగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీగా గంజాయిని కొనుగోలు చేసి, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ముఖ్యంగా అద్దె ఇళ్లలో నివసించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సరఫరా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

పోలీసుల నిఘా నుంచి తప్పించుకునేందుకు నివాసాలు మార్పు

గత రెండేళ్లుగా పలు కేసుల్లో నిందితురాలిగా ఉన్న నీతూ బాయి పోలీసులకు చిక్కకుండా తరచూ నివాసాలు మారుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి, లంగర్‌హౌస్ ప్రాంతాల్లో ఇళ్లు మారుస్తూ నిఘా నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ వినియోగాన్ని కూడా తగ్గించినట్లు వెల్లడించారు. 2026 జూన్‌లో సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు నానక్‌రామ్‌గూడలోని ఆమె నివాసంపై దాడి చేశారు. అయితే అప్పటికి ఆమె అక్కడ లేకపోవడంతో రూ.2.60 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కొనుగోలు కోసం ఆ ఇంటికి వచ్చినట్లు అనుమానించిన సుమారు 50 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు.

ఆటోలో వెళ్తుండగా పట్టుకున్న ఈగల్ ఫోర్స్

నీతూ బాయి కదలికలపై ఈగల్ ఫోర్స్ టెక్నికల్ బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. సాంకేతిక సమాచారం, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా ఆమె ఆచూకీని గుర్తించారు. చివరకు మంగళ్‌హాట్ వైపు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ.1,59,500 నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నీతూ బాయి కుటుంబానికి సంబంధించిన గంజాయి అక్రమ రవాణా వ్యవహారాల్లో గతంలోనూ భారీగా మత్తు పదార్థాలు, నగదు పట్టుబడ్డాయి. 2023 ఆగస్టులో ఆమె కుమారుడు స్కార్పియో వాహనంలో 22 కిలోల గంజాయిని తరలిస్తుండగా గోల్కొండ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కుటుంబానికి సంబంధించిన ఆస్తుల తనిఖీల్లో సుమారు రూ.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అదే ఏడాది అక్టోబర్‌లో గచ్చిబౌలి పోలీసుల దాడిలో 7.5 కిలోల గంజాయి, రూ.5 లక్షల నగదు పట్టుబడ్డాయి.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
8 నవంబర్ 2026

వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు
ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శుభాకాంక్షలు

హకీంపేట్, నవంబర్ 7 (నవగీతం):వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా శ్రీ జువ్వాడి నర్సింగరావు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా హకీంపేట్‌లోని జూపల్లి బాలమ్మ వెలమ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జువ్వాడి నర్సింగరావును ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జువ్వాడి రత్నాకర్ రావు కుటుంబంతో తనకు మొదటి నుంచి మంచి అనుబంధం ఉందని తెలిపారు. జువ్వాడి నర్సింగరావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచందర్ రావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య, జువ్వాడి కృష్ణారావు తదితరులతో కలిసి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొన్నారు.



ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలని పిలుపు

నూగూరు వెంకటాపురం, నవంబర్ 7 (నవగీతం) నూగూరు వెంకటాపురం మండల కేంద్రంలో రాచపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇంకుడు కుంతల కార్యక్రమం ఘనంగా జరిగింది. వర్షపు నీటిని వృధా కాకుండా భూమిలో ఇంకించి భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి వాసం శిరీష, సర్పంచ్ చెరుకూరి రాధ, ఫీల్డ్ అసిస్టెంట్ కాక ధోని నాయకత్వం వహించారు.ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలని పిలుపు:ఈ సందర్భంగా సర్పంచ్ చెరుకూరి రాధ మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఇంటి పైకప్పు మీద పడే వర్షపు నీరు వృధాగా రోడ్ల మీదకు పోకుండా, ఇంకుడు గుంతలోకి మళ్లిస్తే భూగర్భ జలమట్టం బాగా పెరుగుతుందని తెలిపారు.ప్రతి కుటుంబం తమ ఇంటి ముందు కనీసం ఒక్క ఇంకుడు గుంత అయినా తప్పుకోవాలని, అదే నిజమైన నీటి సంరక్షణ అని అన్నారు. ఇంట్లో ఇంకుడు గుంత ఉంటే బోర్లు, బావుల్లో నీరు ఎండిపోకుండా ఉంటుందని, భవిష్యత్తులో నీటి కొరత రాదని వివరించారు.పంచాయతీ కార్యదర్శి వాసం శిరీష మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉంటే గ్రామం మొత్తం నీటి సమస్య నుంచి బయటపడుతుందని అన్నారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాల కోసం చేస్తున్న గొప్ప పని అని చెప్పారు. ప్రతి ఇంటి వద్ద, ప్రతి పొలం గట్టున, రోడ్ల పక్కన, చెరువులు, కుంటల వద్ద ఇంకుడు కుంతలు తవ్వాలని కోరారు.ఫీల్డ్ అసిస్టెంట్ కాక ధోని మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో ఇంకుడు కుంతల పనులు చేపట్టామని, దీనివల్ల కూలీలకు ఉపాధి లభించడంతో పాటు గ్రామానికి శాశ్వత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రతి ఇంట్లో గుంత తవ్వేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు.గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు:ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలోని చెరువులు, కుంటలు, పొలాల గట్లు, రోడ్ల పక్కన, ప్రభుత్వ భూముల్లో ఇంకుడు కుంతలు తవ్వి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామస్తులు మాట్లాడుతూ, సర్పంచ్, కార్యదర్శి పిలుపు మేరకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత తవ్వుతామని, గ్రామాన్ని నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలుపుతామని తెలిపారు.రాచపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం:రాచపల్లి గ్రామ పంచాయతీని నీటి సంరక్షణలో మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్, కార్యదర్శి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఇంకుడు కుంతలు, చెక్ డ్యామ్ లు, నీటి సంరక్షణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడంపై గ్రామస్తులు సర్పంచ్, కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ ను అభినందించారు



గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పై ఆరోపణలు

క్రాప్ లోను విషయంలో అన్యాయమని షరతులు

నూగూరు వెంకటాపురం, నవంబర్ 7 (నవగీతం):
వెంకటాపురం మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వ్యవహారం ఇప్పుడు మండలంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. పట్టాదారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని, క్రాప్ లోన్ విషయంలో అన్యాయమైన షరతులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.
పట్టాదారులు చెబుతున్న ప్రకారం, “మా బ్యాంకులో రైతు భరోసా పడితేనే క్రాప్ లోన్ ఇస్తానని గతంలో నుంచి మేనేజర్ చెబుతున్నారని” ఆరోపిస్తున్నారు. తమ రైతుభరోసా డబ్బులు వేరే బ్యాంకులో పడుతున్నాయనే కారణంతో గ్రామీణ బ్యాంక్ మేనేజర్ క్రాప్ లోన్ చేయడానికి నిరాకరిస్తున్నారని అంటున్నారు.
“రైతుభరోసా మా బ్యాంకులో పడితేనే క్రాప్ లోన్ చేస్తాం, లేకపోతే చేయం” అని మేనేజర్ బెదిరింపు ధోరణిలో చెబుతున్నారని పట్టాదారులు వాపోతున్నారు. రైతుభరోసా ఏ బ్యాంకులో పడాలనేది రైతు ఇష్టమని, దానిని అడ్డం పెట్టుకుని లోన్ ఇవ్వకపోవడం సరికాదని అంటున్నారు.ఇదే కాకుండా గతంలో పెట్టిన పట్టాలకు సంబంధించిన పనుల కోసం వెళ్తే, మధ్యలో డబ్బు ఇవ్వమని మేనేజర్ డిమాండ్ చేస్తున్నారని పట్టాదారులు ఆరోపిస్తున్నారు. పాత పట్టాలు ఉన్నా కొత్తగా ఏవేవో సాకులు చెప్పి పని ఆపుతున్నారని, డబ్బు ఇస్తేనే పని చేస్తామన్నట్టుగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.
ఈ షరతుల వల్ల వేరే బ్యాంకుల్లో రైతుభరోసా పొందుతున్న పట్టాదారులందరూ క్రాప్ లోన్ కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారని రైతులు అంటున్నారు. సమయానికి లోన్ రాకపోతే వ్యవసాయ పనులు, మందులు, ఎరువులు కొనడం ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరపాలని పట్టాదారులు డిమాండ్ చేస్తున్నారు. బ్యాంక్ లో సీసీ కెమెరాలను పరిశీలించి, పట్టాదారుల నుంచి వివరాలు సేకరించి నిజానిజాలు బయటపెట్టాలని కోరుతున్నారు.
తప్పు జరిగితే మేనేజర్ ఎన్ రత్నకర్ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఏ రైతుకు ఇబ్బంది లేకుండా నిబంధనల ప్రకారం క్రాప్ లోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



రాష్ట్ర వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, నవంబర్7,(నవగీతం) తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. శనివారం హైదరాబాద్‌లోని మైత్రీవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కేవీపీ రామచంద్రరావు, జువ్వాడి సోదరులు కృష్ణారావు, శేఖర్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. వారి సమక్షంలో జువ్వాడి నర్సింగరావు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావుకు ప్రత్యేక గజమాలతో ఘన స్వాగతం పలికారు. పలువురు నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయనకు రాష్ట్రస్థాయి కీలక బాధ్యతలు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. నాయకులు జేవన్ వెంకట్, ఆకుల లింగారెడ్డి, ఆనంద్ గౌడ్, అన్నం అనిల్, అడేపు మధు, పుప్పాల ప్రభాకర్, నర్సయ్య, స్వామి, కోరుట్ల పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మండల అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర శేఖర్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, ధర్మారం సర్పంచ్ దూద రంజిత్, గ్రామ సర్పంచులు ధ్యాగ గంగాధర్, సరికెళ్ల లతికా నరేష్, ఎం.డి. రహీం, నాయకులు పల్లపు అశోక్, ఏలేటి శశిందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్. రాజయ్య, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





చదివిన బడికి లక్ష.. చదువుకు ప్రోత్సాహం!

ప్రతిభావంతులకు ఏటా బహుమతి – జగన్నాథరావు భారీ విరాళం



వైరా, నవంబర్ 7 (నవగీతం): తాను చదివిన బడి రుణం తీర్చుకునేందుకు వైరా వాస్తవ్యులు, రిటైర్డ్ వి.డి.ఓ కొత్త జగన్నాథరావు ముందుకు వచ్చాడు. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు లక్ష రూపాయల భారీ విరాళం అందజేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు.శుక్రవారం ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనమా సీతారామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం కోసం లక్ష రూపాయల నగదు విరాళాన్ని ప్రధానోపాధ్యాయుడికి అందజేశాడు.ఈ మొత్తాన్ని పాఠశాల పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేసి, వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం 10వ తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన ఇద్దరు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ నగదు బహుమతులు ఇవ్వాలని దాత కోరాడు.ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వైరా మండల శాఖ అధ్యక్షుడు చల్లా కృష్ణారావు మాట్లాడుతూ...ఇదే బడిలో చదువుకొని, ఇదే బడి పేద విద్యార్థులను ప్రోత్సహించడం ఆదర్శనీయమని అభినందించాడు. ప్రధానోపాధ్యాయుడు సీతారామారావు, సీనియర్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో తమ విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, ముఖ్య సలహాదారుడు టి.వి. కృష్ణయ్య సూరి, ఆర్థిక కార్యదర్శి సామినేని వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైరా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



వైరా,నవంబర్ 7 (నవగీతం): వైరా ప్రెస్ క్లబ్‌లో నూతన కార్యవర్గం కొలువుదీరింది. అనుభవజ్ఞులకు గౌరవం కల్పిస్తూ, బాధ్యతాయుతమైన నాయకత్వానికి పట్టం కడుతూ జర్నలిస్టులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి.ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులుగా ఏడునూతల బుచ్చి రామారావు, ఓర్సు శ్రీనివాసరావు, సూర్యదేవర సంగమేశ్వర ప్రసాద్ ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా దేవబత్తిని సీతారాములు, ప్రధాన కార్యదర్శిగా ఇజ్జగాని మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వాకదాని శ్రీకాంత్, కోశాధికారిగా షేక్ షాకీర్, సహాయ కార్యదర్శులుగా మామిళ్లపల్లి విజయ్, తుప్పతి రవికుమార్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా వేము విజయ్, నారపోగు ప్రసాద్, కేసా నాగరాజు, ఇన్నపల్లి కృష్ణ, కే. నాగభూషణం, మోదుగు వినోద్, మొద్దు రమేష్, పంతంగి నరేష్, గొడ్ల నరసింహారావు, నెమలికొండ గోవిందాచారి, సత్తెనపల్లి నరసింహారావు, గొండేల రవికుమార్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల ఐకమత్యమే ప్రధాన లక్ష్యంగా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులుగా తమ బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నికతో వైరా ప్రెస్ క్లబ్‌లో నూతనోత్సాహం నెలకొంది.

వైరా గెజిటెడ్ హెచ్ఎంల సంఘానికి కొత్త సారథులు

అధ్యక్షుడిగా చావా శ్రీనివాసరావు..
ప్రధాన కార్యదర్శిగా విజయబాబు




వైరా, నవంబర్ 7(నవగీతం): వైరా మండల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘానికి నూతన నాయకత్వం కొలువుదీరింది.రాబోయే రెండేళ్ల కాలానికి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చావా శ్రీనివాసరావు, కొత్తపల్లి విజయబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం వైరా మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.సమావేశానికి జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆర్. వీరస్వామి, ప్రధాన కార్యదర్శి డి. పుల్లయ్యతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సేకరించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారంలో సంఘం పాత్ర, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై జిల్లా అధ్యక్షుడు ప్రసంగించారు.అనంతరం గన్నవరం ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ చావా శ్రీనివాసరావును మండల సంఘం అధ్యక్షుడిగా, గొల్లపూడి ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి విజయబాబును ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రెబ్బవరం, కేజీ సిరిపురం ప్రధానోపాధ్యాయులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు,ఐ. సూర్యకుమారి,పి. శివనారాయణ,కే.మార్క్, కే.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
8 నవంబర్ 2026

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని ఉద్యోగుల పదోన్నతుల్లో అమలు చేయడం అభినందనీయం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ కృతజ్ఞతలు



హైదరాబాద్,నవంబర్7,(నవగీతం)
తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో మాదిగ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల్లో అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగులకు న్యాయం చేకూర్చే దిశగా కీలక అడుగుగా వారు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి. కాశీం, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు ఘన సన్మానం





హకీంపేట్, నవంబర్ 7 (నవగీతం): తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ను మల్లాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. హకీంపేట్‌లోని బాలమ్మ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సందర్భంగా జువ్వాడి నర్సింగరావును మల్లాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు గజమాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ సుద్దు అమృత సురేందర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఏలాల జలపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ మండల అధ్యక్షులు మాట్ల సోమయ్య, కాంగ్రెస్ నాయకులు సిరిపూర్ మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, గుండంపల్లి సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య, మోగిలిపేట్ సర్పంచ్ గోల్కొండ కళా రమేష్ , గొర్రెపల్లి సర్పంచ్ ఎలేటి వెంకటరెడ్డి, నాయకులు రోడ్ల రాజారెడ్డి, శాఖపురపు కిరణ్,సామ మోహన్ రెడ్డి, కొత్తూరు నారాయణ, కొత్తూరు గంగారెడ్డి,రాజేందర్, ఆనంద్ గౌడ్,ఎదులాపురం రమేష్, వార్డు సభ్యులు నత్తి రాము, నత్తి లక్ష్మణ్, సుద్దు దేవరాజ్, కేలేటి రమేష్ వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జువ్వాడి నర్సింగరావు ను సన్మానించిన ప్రెస్ క్లబ్ సభ్యులు



హకీంపేట్, నవంబర్ 07,(నవగీతం) తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. శనివారం హైదరాబాద్‌లోని మైత్రీవనంలో మంత్రుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం హకీంపేటలోని కన్వెన్షన్ హాల్‌లో జువ్వాడి నర్సింగరావు గౌరవార్థం ఆత్మీయ నవ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గానికి చెందిన పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వెలమ సంఘం ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లికార్జున్‌తో పాటు పాత్రికేయులు గోడికే రాజు, సాల్వాజీ రాజా రమేష్, సాజిద్ ఆలీ, గజం శంకర్, చెట్పల్లి లక్ష్మణ్, ఇందూరి నరేష్, పిన్నంశెట్టి శ్రీధర్, జవ్వాజి గంగాధర్ తదితరులు జువ్వాడి నర్సింగరావును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ తరఫున ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం జువ్వాడి నర్సింగరావు చిత్రపటాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా విడుదలపై హర్షం

యూఏఈ ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు బత్తిని రాజా గౌడ్



జగిత్యాల, నవంబర్7,(నవగీతం): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.5 లక్షల గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా పథకంలో భాగంగా మరో 32 మంది గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు మొత్తం రూ.1.60 కోట్ల ఆర్థిక నహాయం మంజూరు చేన్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ. చేసినట్లు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి తెలిపారని అని యూఏఈ ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు బత్తిని రాజాగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

ఈ విషయంపై రాజగౌడు మాట్లాడుతూ
ఈ నెల 3వ తేదీన సాధారణ పరిపాలన (ఎన్ఆర్ఐ) శాఖ జారీ చేసిన జీఓ నెం.1603 ద్వారా ఈ ఆర్థిక సహాయానికి పరిపాలనా అనుమతి లభించింది అని అన్నారు.ఇందులో కామారెడ్డి జిల్లాకు చెందిన 15 మంది మృతుల కుటుంబాలకు రూ.75 లక్షలు, నిజామాబాద్ జిల్లాకు చెందిన 17 మంది మృతుల కుటుంబాలకు రూ.85 లక్షలు,ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.1 కోటి 60 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ఆమోదించింది.బత్తిని రాజా గౌడ్ తెలిపారు 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి,తెలంగాణకు చెందిన కార్మికులు బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లో మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది.ఈ విషయంపై స్పందించిన తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి గారికి గల్ఫ్ కార్మికుల పక్షాన యూఏఈ ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు బత్తిని రాజాగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు

ఖేత్ బచావో అభియాన్‌పై అవగాహన

ఆరుతడి పంటలపై మొగ్గు చూపాలి

ఎంఏవో పి. జ్యోతి



కొడిమ్యాల, నవంబర్ 7(నవగీతం) : మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఖేత్ బచావో అభియాన్(సాగు భూమి సంరక్షణ)పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో ఎల్నినో ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ముందు జాగ్రత్తగా పంటలను సంరక్షించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ?యాసంగి సీజన్ లో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున నీటిని ఆదా చేసే ఆరుతడి పంటల వైపే రైతులు మొగ్గు చూపాలని కోరారు. ముఖ్యంగా మొక్కజొన్న, పెసర, మినుములు, శనగలు, నువ్వులు వంటి నూనె గింజ పంటలను సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వరి కోతల అనంతరం పంట అవశేషాలను తగలేయడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని హెచ్చరించారు. పంట వ్యర్థాలను పశుగ్రాసంగా వాడుకోవాలని లేదా నేలలో కలియదున్ని నేల సారాన్ని పెంచుకోవాలని తెలిపారు. హార్టికల్చర్ హెచ్ఈఓ ఎన్.అనిల్ మాట్లాడుతూ.. కూరగాయల సాగు, ఆయిల్ పామ్ సాగు పద్ధతులు వాటికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వివరాలను వివరంగా వెల్లడించారు. అనంతరం గ్రామ సర్పంచ్ నేరెళ్ల మహేష్ మాట్లాడుతూ..ఎల్-నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు వరి సాగును తగ్గించి, ఆరుతడి పంటల సాగుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.? ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి, వ్యవసాయ విస్తరణాధికారి తేజస్విని, పంచాయతీ కార్యదర్శి నవీన్, రైతులు పాల్గొన్నారు.

ధ్రువ వైన్స్ వ్యవహారంపై విచారణ జరపాలి

అక్రమాలపై ఆరోపణలు-అధికారులు స్పందించాలని



నూగూరు వెంకటాపురం, నవంబర్ 7 (నవగీతం) వెంకటాపురం మండలంలోని ధ్రువ వైన్స్ లో అక్రమాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం సాగుతోందనే ఆరోపణలు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. స్థానికులు చెబుతున్న ప్రకారం మద్యం ఎమ్మార్పీ ధరకే అమ్మడం లేదని ఆరోపిస్తున్నారు.దీనిపై ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి క్షుణ్ణంగా విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు పాటించకుండా వ్యాపారం చేస్తుంటే సామాన్య ప్రజలు నష్టపోతారని, అందుకే అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. విచారణలో నిజానిజాలు బయటపడితేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అంటున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని, తప్పు జరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు మద్దతు ధర రాకుండా చేస్తున్న దళారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి

మెట్ పల్లి, నవంబర్7,(నవగీతం) రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందన ఆనందములో రైతులు ఉండగా నేడు సన్న వడ్లకు ఈ రోజు రూ. 2500/- నుంచి రూ.2700/- వరకే ధర వస్తుంది, మొన్నటి వరకు మన పక్క జిల్లా నిజామాబాద్ లో రూ.3700/- నుంచి రూ. 4200/- వరకు మద్దతు ధర అక్కడి రైతులకు వచ్చింది, కానీ నేడు మన జిల్లా లో దళారులు సిండికేట్ గా ఏర్పడి రైతులకు రూ.400/- నుంచి రూ.500/- రైతులని ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, ఇదే విధమైన పరిస్థితి కొనసాగితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. దళారులను ప్రభుత్వం వెంటనే కట్టడి చేసి రైతులకు మద్దతు ధర వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు, ఇట్టి విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రి దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకునే విధంగా వారి దృష్టి కి తీసుకువెళ్తానని అల్లూరి మహేందర్ రెడ్డి తెలిపారు

వైరా-మధిర హైవే రోడ్డు దుస్థితిపై అధికారుల నిర్లక్ష్యం..

మరమ్మతులు చేపట్టాలి: గుత్త నాగేంద్ర బాబు



వైరా,నవంబర్-07 (నవగీతం) వైరా నుంచి మధిరకు వెళ్లే ప్రధాన హైవే రోడ్డు తీవ్ర దుస్థితికి చేరుకున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని బీజేపీయం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్త నాగేంద్ర బాబు విమర్శించారు. రహదారిపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న రోడ్డు కారణంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. చిన్నపాటి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ రహదారి ఇంత దారుణంగా ఉండటం పాలనా నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. నియోజకవర్గ పర్యటనల సమయంలో ఇదే రహదారిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయాణిస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వైరా-మధిర హైవే రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గుత్త నాగేంద్ర బాబు డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల తరపున బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వైరాలో జీవో. 59 దరఖాస్తులు వేగంగా పరిశీలన



వైరా, నవంబరు 7 (నవగీతం): వైరా మున్సిపాలిటీ పరిధిలో 59 జారీ ఉత్తర్వుల జీవో 59 పరిశీలన కార్యక్రమం వేగవంతంగా సాగుతోంది. ఇందులో భాగంగా శనివారం నాటి మున్సిపాలిటీలోని 11వ వార్డులో జిల్లా పంచాయతీ అధికారి డిపిఓ జి. వినోద్ కుమార్ పర్యటించారు.59 జీవో కింద తమ నివాస స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న స్థానిక నివాసితులు షేక్ నాగుల మీరా, కంటేపూడి శంకర్ రావుల గృహాలను ఆయన స్వయంగా సందర్శించారు. వారి స్థలాలకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించడమే కాకుండా, వారు సమర్పించిన 59 జీవో దరఖాస్తు పత్రాలను మరియు అనుబంధ ధృవీకరణ పత్రాలను డీపీఓ వినోద్ కుమార్ కూలంకషంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ దొంతేబోయిన వెంకటేశ్వర్లు, వార్డు ఆఫీసర్ షేక్ లాల్ మియా, గ్రామ పాలనాధికారి వీఆర్వో, మస్తాన్ వలితో పాటు పలువురు మున్సిపల్ అధికారులు, వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

వైరా పోలీస్ స్టేషన్‌లో కీలక మార్పు..!

ఎస్‌హెచ్‌ఓగా పి. ప్రవీణ్ కుమార్.. వీఆర్‌కు పి. రామారావు బదిలీ!

వైరా, నవంబర్ 7(నవగీతం): వైరా పోలీస్ స్టేషన్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. ప్రస్తుతం ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ పి. రామారావును వీఆర్ ఖమ్మంకు బదిలీ చేస్తూ ఖమ్మం పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో పి. ప్రవీణ్ కుమార్‌ను వైరా పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా నియమించారు.ఏమహబూబాబాద్ జిల్లా సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న పి. ప్రవీణ్ కుమార్‌కు వైరా పోలీస్ స్టేషన్ బాధ్యతలు అప్పగించారు. పరిపాలనా కారణాలతో చేపట్టిన ఈ బదిలీల్లో భాగంగా ఈ మార్పులు చోటుచేసుకున్నాయి.ఈ మేరకు శనివారం ఖమ్మం పోలీస్ కమిషనర్ అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు.

ఈ.వీ.ఎం. గోదాము ను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, నవంబర్ 07,(నవగీతం) ఎన్నికల సంఘం ఆదేశానుసారం సాధారణ తనిఖీ లో భాగంగ ధరూర్ క్యాంప్‌లోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు) గోదామును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం తనిఖీ చేశారు.
ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాల భద్రత, గోదాము వద్ద చేపట్టిన రక్షణ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాము పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతున్న తీరును సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోదాము వద్ద ఏర్పాటు చేసిన భద్రతా వ్యవస్థ నిరంతరం పనిచేసేలా చూడాలని, సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.
ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ఎలక్షన్ సూపరిండెంట్ జ్యోతి జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
8 నవంబర్ 2026

అవుసులపల్లిలో పోలీసుల విస్తృత తనిఖీలు..

75 వాహనాలు స్వాధీనం

మెదక్ : నేరాల నియంత్రణ, ప్రజల భద్రత లక్ష్యంగా మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో 90 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపట్టారు. ఈ సందర్భంగా సరైన వాహన పత్రాలు లేని 69 ద్విచక్ర వాహనాలు, రెండు బొలెరోలు, నాలుగు ఆటోలను కలిపి మొత్తం 75 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో భాగంగా నార్కోటిక్ డాగ్ జూబి సహాయంతో ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల ఉనికిని పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో వేలిముద్రలను సేకరించి పాత నేరస్థుల వివరాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. చిన్న దూరమైనా హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, స్ట్రాప్ బిగించుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలికతో ఆమె



అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకున్నా పోక్సో చట్టం ప్రకారం నేరమేనని, నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని, వారి భద్రత, నేరాల నియంత్రణ కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అదనపు ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామస్థులకు అందుబాటులో ఉండేందుకు వీఓపీ ఏఎస్ఐ విఠల్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో స్నేహం పేరుతో మోసం

కిలోల కొద్దీ బంగారం, వెండి చోరీ
స్నేహితురాలిని నమ్మించి ఆమె పిన్ని ఇంట్లో భారీ చోరీ
నిందితుడు కాలేజీ వార్డెన్ చంద్రశేఖర్‌గా గుర్తింపు
సుమారు అరకిలో బంగారం, మూడు కిలోల వెండి అపహరణ
నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు...

హైదరాబాద్ : బంగారం, నగదు స్వాధీనంస్నేహం పేరుతో నమ్మించి భారీ చోరీకి పాల్పడిన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. తన స్నేహితురాలి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ యువకుడు, ఆమె పిన్ని ఇంట్లో ఏకంగా అర కిలోకు పైగా బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలను అపహరించాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతని నుంచి భారీగా బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు, అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె పిన్ని కుమారి మానే పద్మావతి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారం ఉన్నట్లు నిందితుడు గుర్తించాడు. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం తాకట్టు పెట్టి తీర్చేసి తిరిగి ఇచ్చేస్తానని ఆ విద్యార్థినిని నమ్మించి, ఆమె వద్ద నుంచి ఇంటి తాళాలు సంపాదించాడు. గత అక్టోబరు 20న పద్మావతి తన ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో చంద్రశేఖర్ ఈ చోరీకి తెగబడ్డాడు. ఇంట్లోని 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లాడు. బాధితురాలి



ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. బాధితురాలి సోదరి కుమార్తె ద్వారా చంద్రశేఖర్‌పై అనుమానం వ్యక్తమైంది. దీంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు, నిందితుడిని తిరుమలగిరిలో అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అపహరించిన బంగారంలో కొంత భాగాన్ని గుంటూరు, చార్మినార్ ప్రాంతాల్లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు వెల్లడించాడు. నిందితుడి నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేట : సిద్దిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రారంభించారు ఈ సందర్భంగా రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, అకాల వర్షాలతో రైతులు పడుతున్న ఇబ్బందులు, మార్కెట్ యార్డుల దుస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.రాష్ట్రంలో కరువు పరిస్థితుల వల్ల ఒకవైపు దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు కన్నీళ్లు పెడుతుంటే.. మరొకవైపు పండిన కాస్త పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో, ముఖ్యంగా దొడ్డు వడ్లు పండించిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సిద్దిపేట, మెదక్ తదితర జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాల వల్ల కళ్లాలలో, ఐకేపీ సెంటర్లలో, పీఏసీఎస్ సెంటర్లలో, మార్కెట్ యార్డులలో పోసిన వడ్లు తడిసిపోయి, వరదకు కొట్టుకుపోతున్నాయి.రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ కొనుగోలు కేంద్రానికి కూడా ప్యాడీ క్లీనర్లు గానీ, టార్పాలిన్ కవర్లు గానీ, మాయిశ్చర్ మీటర్లు గానీ చేరలేదు. వడ్లు కొన్న తర్వాత తరలించడానికి అవసరమైన లారీల ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు ఇంతవరకు ఫైనల్ చేయలేదు; ఏ గ్రామం వడ్లు ఏ మిల్లుకు వెళ్లాలనే 'మిల్ అలాట్‌మెంట్' కూడా ఇప్పటికీ జరగలేదు.కరువు పరిస్థితుల్లో సన్న వడ్లను ప్రైవేట్ వ్యాపారులు కొంటున్నారు, మరి దొడ్డు వడ్లు పండించిన రైతుల పరిస్థితి ఏమిటి? సివిల్ సప్లైస్ మంత్రి, మార్కెటింగ్ శాఖ మంత్రి అసలు ఏం చేస్తున్నారు? రైతులంటే కనీస పట్టింపు లేకుండా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టుగా రైతుల పరిస్థితి తయారైంది. రైతు రెండు ఎకరాల్లో నాటు వేస్తే కరువు దెబ్బకు ఎకరం ఎండిపోయింది, మిగిలిన ఎకరంలో పండిన పంటను కూడా ప్రభుత్వం సకాలంలో కొనకపోవడంతో అకాల వర్షాలకు తడిసిపోయి రైతులు ఆగమవుతున్నారు.ప్రభుత్వం తక్షణమే యుద్ధప్రాతిపదికన అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు, మిల్ అలాట్‌మెంట్ వెంటనే పూర్తి చేయాలి. రెవెన్యూ, సివిల్ సప్లైస్, డీఆర్డీఏ, కో ఆపరేటివ్ అధికారులు తక్షణమే ఫీల్డ్‌లోకి వెళ్లి రైతులకు



ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ : దశాబ్ద కాలంగా సొంతింటి కోసం ఎదురు చేస్తున్న పొన్నం కోమల-సమ్మయ్య ముదిరాజ్ లకు ప్రజా పాలన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఘనంగా మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి..కార్యక్రమంలో ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు యజమాని పొన్నం కోమల-సమ్మయ్య ముదిరాజ్ లకు మంత్రి పొన్నం ప్రభాకర్ బట్టలు పెట్టి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సందర్భంగా లబ్దిదారు ఇంట్లో క్రాకర్స్ కాల్చి బాణసంచా పేల్చి ఘనంగా దీపావళి జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ కౌన్సిలర్ లు, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ఇతర ముఖ్య నేతలు,అధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కలను ప్రజా పాలన ప్రభుత్వంలో సాకారం చేస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపింది ఈ దీపావళి పండుగను మా ఇందిరమ్మ ఇళ్లలో జరుపుకుంటున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలుహుస్నాబాద్ పట్టణంలో కోమల సమ్మయ్య ఇందిరమ్మ ఇంట్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నాం. ప్రజా పాలన ప్రభుత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గానికి మొదటి దశలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి 2500 పైగా ఇళ్లు పూర్తయ్యాయి.500 గుడిసెల స్థానంలో ఇళ్లు, మధ్యలో నిలిచిపోయిన మరో 500 ఇళ్లకు, రెండో దశలో 1,000 ఇళ్లకు మంజూరు అయ్యాయిఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వారం,పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియ పూర్తి చేస్తాంరూఫ్ లెవల్‌లో ఉన్న లబ్ధిదారులు కూడా త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి.

అమరవీరుల త్యాగాలు వృథా కానివ్వం..

ప్రజా విముక్తి పోరాటమే లక్ష్యం
టేకులగూడెంలో విప్లవ అమరవీరులకు ఘన నివాళి..
వారి ఆశయ సాధనకు ఐక్యంగా కదలాలి:
మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కారేపల్లి : ప్రజల హక్కులు, భూమి, భుక్తి, విముక్తి కోసం తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని, వారు కన్న కలల సమాజ నిర్మాణం కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో శుక్రవారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.మాస్‌లైన్ మండల కార్యదర్శి, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామానికి చెందిన అమరవీరులు కామ్రేడ్ స్వర్ణపాక లక్ష్మీనరసి, కామ్రేడ్ పాయం లక్ష్మీనారాయణతో పాటు వివిధ ప్రజా ఉద్యమాల్లో ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. 1969లో నక్సల్బరి ఉద్యమంతో ప్రారంభమైన భారత కమ్యూనిస్టు విప్లవోద్యమం భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంగా దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. శ్రీకాకుళం, గోదావరి లోయ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో భూస్వామ్య దోపిడీ, సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో ఎందరో విప్లవకారులు ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. ప్రజల విముక్తి కోసం తమ జీవితాలను అంకితం చేసిన అమరవీరుల త్యాగాలు విప్లవోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

భాగ్యనగర్ తండాలో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక ప్రాధాన్యం

వర్షాల నేపథ్యంలో వ్యాధుల నివారణకు గ్రామవ్యాప్తంగా బ్లీచింగ్ చల్లింపు..
ప్రజారోగ్యమే ప్రథమ లక్ష్యం:
సర్పంచ్ బానోత్ హీరాలాల్

కారేపల్లి : గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుపాను ప్రభావంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ పారిశుద్ధ్య పనులను సర్పంచ్ బానోత్ హీరాలాల్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని, ప్రజారోగ్య పరిరక్షణే తమ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వర్షాల అనంతరం ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడంతో పాటు, గ్రామంలో నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెండ్ర అనిల్ కుమార్, వార్డు సభ్యుడు గాంధీ, మాజీ ఎంపీటీసీ బానోత్ రాంచందర్, పంచాయతీ సిబ్బంది హేంచంద్, నంద, రమేష్, రాందాస్, గణేష్, రాధా, లకన్, రాకేష్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి ఆఫర్ పేరుతో సైబర్ మోసాల వల..

ప్రజలూ తస్మాత్ జాగ్రత్త
ఎయిర్‌టెల్ పేరుతో రూ.2 వేల నకిలీ కానుక..
లింక్ తెరిస్తే బ్యాంకు ఖాతాలకు ముప్పు..
అప్రమత్తంగా ఉండాలని కారేపల్లి సీఐ నునావత్ సాగర్ సూచన

కారేపల్లి : పండుగల వేళ ప్రజలకు ఉచిత కానుకల ఆశ చూపుతూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని కారేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నునావత్ సాగర్ తెలిపారు. దీపావళి కానుకగా ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ రూ.2,000 నగదు అందిస్తోందంటూ వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న సందేశాలు నకిలీవని పేర్కొన్నారు. ఇలాంటి సందేశాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.ఉచిత కానుకల మాటున మోసం..ఎయిర్‌టెల్ పేరుతో వస్తున్న లింక్‌లకు ఆ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని సీఐ తెలిపారు. గుర్తుతెలియని లింక్‌లను తెరిస్తే వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరే ప్రమాదం ఉందన్నారు. ఉచిత నగదు, బహుమతుల పేరుతో వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు పోయి కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని తెలిపారు.

వైరా నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

కారేపల్లి : వెలుగుల పండుగ దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని వైరా నియోజకవర్గ ప్రజలకు శాసనసభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు.దీపావళి అనేది కేవలం దీపాలు వెలిగించి సంబరాలు చేసుకునే పండుగ మాత్రమే కాదని, మనిషిలోని అహంకారం, అసూయ, ద్వేషం, చెడు ఆలోచనలను తొలగించుకొని ప్రేమ, మానవత్వం, ధర్మం, సత్యం అనే సద్గుణాలను ఆచరించాలనే గొప్ప సందేశాన్ని అందించే పర్వదినమని తెలిపారు. శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికిన ఆనందోత్సవాలకు దీపావళి ప్రతీకగా నిలుస్తుందని వివరించారు.ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, నూతనోత్సాహం నింపాలని, ప్రతి ఇంటా ఆనందాల దీపాలు వెలగాలని ఆకాంక్షించారు. ప్రజల మధ్య ప్రేమానురాగాలు, సోదరభావం, ఐకమత్యం మరింత బలోపేతం కావాలని, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని కోరారు.వైరా నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రగతిపథంలో ముందుకు సాగాలని, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, పేద ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గ ప్రజలందరికీ మరోసారి దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

జానకి నగర్‌లో వైభవంగా శ్రీ కాళికాదేవి అమ్మవారి జాతర మహోత్సవాలు

మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు,హోమాలు.
పెద్ద సంఖ్యలో పాల్గొననున్న భక్తులు

సూర్యాపేట : దీపావళి పండుగను పురస్కరించుకొని చిలుకూరు మండలం జానకి నగర్ గ్రామంలోని శ్రీ కాళికాదేవి అమ్మవారి దేవాలయం వద్ద మూడు రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా దేవాలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించడంతో పాటు భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనమైన ఏర్పాట్లు చేస్తున్నారు. దాతల సహకారంతో ఈ జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ పవిత్ర జాతర మహోత్సవాలకు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ సభ్యులు కోరారు. శ్రీ కాళికాదేవి అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు: దేవాలయ అధ్యక్షులు బట్టు వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారులు బట్టు శ్రీనివాస్, బట్టు రమణ, బట్టు రమేష్, బట్టు కరంచంద్, రత్నావత్ తిరుమల, కోశాధికారి డుంగ్రోత్ లాలు, ప్రధాన కార్యదర్శులు బట్టు అభిషేక్, బట్టు కేవల్ పంతు, సహాయ కార్యదర్శి బట్టు సక్రు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
8 నవంబర్ 2026

బిజినెస్

బంగారం కొంటున్నారా? తస్మాత్ జాగ్రత్త.. యాసిడ్ పరీక్షలోనూ దొరకని కొత్త కల్తీ!



న్యూఢిల్లీ: బంగారం కొనుగోలుదారులు, నగల వ్యాపారులను ఆందోళనకు గురిచేస్తున్న కొత్త తరహా కల్తీ దందా వెలుగులోకి వచ్చింది. బంగారంలో రుథేనియం, ఇరిడియం, ఓస్మియం వంటి భార లోహాల సన్నని పొడిని కలిపి దాని బరువును కృత్రిమంగా పెంచుతున్నారు. ఈ కల్తీ బంగారం అసలైన బంగారంలా ఉండటమే కాకుండా సాధారణంగా చేసే యాసిడ్ పరీక్ష, టచ్‌స్టోన్(గీటురాయి) పరీక్షల్లోనూ దొరుకడం లేదు. నగలను తయారు చేసేందుకు బంగారాన్ని కరిగించినప్పుడు మాత్రమే అసలు మోసం బయటపడుతున్నది. ఈ కొత్త తరహా కల్తీని మార్కెట్లో 'గోల్డ్ పౌడర్'గా పిలుస్తున్నట్టు వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సరాఫా మార్కెట్లో పనిచేస్తున్న పలువురు నగల తయారీ కళాకారులు బంగారం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇండోర్ సిల్వర్, గోల్డ్ అండ్ జ్యువెలరీ ట్రేడర్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించింది. బులియన్ వ్యాపారులు, మధ్యవర్తులు బంగారం కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. 99.50 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం వ్యాపారానికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్టు స్థానిక వ్యాపారవర్గాలు తెలిపాయి.

మూడేండ్లుగా భారీ లోహాల కల్తీ ఫిర్యాదులు

రుథేనియం, ఇరిడియం, ఓస్మియం వంటి లోహాలను బంగారంలో కలుపుతున్నారన్న ఫిర్యాదులు గత రెండు మూడేండ్లుగా వస్తున్నాయని వ్యాపారులు చెప్తున్నారు. వీటి సాంద్రత ఎక్కువగా ఉండటంతో తక్కువ పరిమాణంలో కలిపినా బంగారం మొత్తం బరువు పెరుగుతుంది. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ మార్గాల ద్వారా ఈ కల్తీ పదార్థాలు భారత మార్కెట్లకు చేరుతున్నట్టు అనుమానిస్తున్నారు. వీటిని చైనాలో తయారు చేస్తున్నారన్న సందేహాలు కూడా ఉన్నప్పటికీ, వాటి మూలాలపై స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. సాధారణ యాసిడ్, గీటురాయి పరీక్షలతో పాటు పాతతరహా క్యారెట్ పరీక్షా యంత్రాలు కూడా ఈ కల్తీని గుర్తించడంలో విఫలమవుతున్నట్టు వ్యాపారులు చెప్తున్నారు. ఎక్స్రే ఫ్లోరోసెన్స్ (ఎక్స్ఆర్ఎఫ్) పరీక్షలు, ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులతో బంగారంలోని ఇతర లోహాల ఉనికిని గుర్తించే అవకాశం ఉన్నది. అందువల్ల బంగారం కొనుగోలు, విక్రయాల్లో నాణ్యతా పరీక్షలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

వినియోగదారులు ఏం చేయాలి?

బీఐఎస్ హాల్‌మార్క్ , ఆరు అంకెల గుర్తింపు సంఖ్య ఉన్న నగలనే కొనుగోలు చేయాలి.
బీఐఎస్ కేర్ యాప్‌లో నంబరును నమోదు చేసి నగ వివరాలు, ప్రకటించిన స్వచ్ఛతను పరిశీలించాలి.
నమ్మకమైన నగల దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
కొనుగోలు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి.
అనుమానం ఉంటే పరీక్షా కేంద్రంలో నాణ్యతను పరీక్షించాలి.

దీపావళి బోనస్ వచ్చిందా? ఇలా చేస్తే బెస్ట్!



దీపావళి వస్తుందంటే ఉద్యోగుల్లో ఎక్కడ చూసినా బోనస్‌ల సందడి ఉంటుంది. పండుగ వేళ ఉద్యోగులకు వచ్చే బోనస్ అదనపు ఆనందాన్ని ఇస్తుంది. అయితే చేతికి అందిన ఆ మొత్తాన్ని ఎలా ఉపయోగించుకోవాలన్నది చాలామందికి ఎదురయ్యే ప్రశ్న. పండుగ షాపింగ్ కోసం ఖర్చు చేయాలా? అప్పులు తీర్చాలా? అత్యవసర అవసరాల కోసం పొదుపు చేయాలా? లేక పెట్టుబడులు పెట్టాలా? ఆర్థిక నిపుణుల సూచనల ప్రకారం.. బోనస్‌ను ఒకేసారి ఖర్చు చేయకుండా, ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, అప్పులు, భవిష్యత్తు అవసరాలను బట్టి విభజించుకోవడం మంచిది.

బోనస్‌ను ఇలా విభజించుకోవచ్చు..

ఎయిర్‌పే మనీ సీఈఓ కుమార్ బినిత్ సూచించిన 20:30:30:20 విధానం ఒక ప్రాథమిక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. దీని ప్రకారం బోనస్‌లో 20 శాతం పండుగ ఖర్చులకు, 30 శాతం అత్యవసర పొదుపులకు, మరో 30 శాతం అప్పుల చెల్లింపునకు, మిగిలిన 20 శాతం పెట్టుబడులకు కేటాయించవచ్చు. ఉదాహరణకు రూ.50,000 బోనస్ వస్తే.. రూ.10,000 పండుగ ఖర్చులకు, రూ.15,000 అత్యవసర నిధికి, రూ.15,000 అప్పుల చెల్లింపునకు, మరో రూ.10,000 పెట్టుబడులకు వినియోగించవచ్చు.

క్రెడిట్ కార్డు అప్పులుంటే తీర్చేయండి..

బోనస్‌తో పెట్టుబడులు పెట్టే ముందు క్రెడిట్ కార్డు బకాయిలు, అధిక వడ్డీ వ్యక్తిగత రుణాలు ఉంటే వాటిని తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాలి. ఎందుకంటే ఈ రుణాలపై చెల్లించే వడ్డీ భారం ఎక్కువగా ఉంటుంది. మరోవైపు మ్యూచువల్ ఫండ్లు, షేర్లలో వచ్చే రాబడికి ఎలాంటి హామీ ఉండదు. కాబట్టి అధిక వడ్డీ అప్పులను కొనసాగిస్తూ పెట్టుబడులు పెట్టడం కంటే వాటిని ముందుగా క్లియర్ చేయడం ప్రయోజనకరం.

అత్యవసర నిధి తప్పనిసరి

అప్పులు తీర్చడంతోపాటు కనీసం మూడు నుంచి ఆరు నెలల కుటుంబ ఖర్చులకు సరిపడా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. ఉదాహరణకు నెలకు రూ.40,000 ఖర్చు చేసే వ్యక్తి రూ.1.2 లక్షల నుంచి రూ.2.4 లక్షల వరకు అత్యవసర నిధిగా సమకూర్చుకోవాలి. ఉద్యోగ భద్రత తక్కువగా ఉన్నవారు, కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉన్నవారు మరింత మొత్తాన్ని కేటాయించుకోవచ్చు. ఈ డబ్బును సులభంగా ఉపసంహరించుకునే పొదుపు ఖాతా లేదా తగిన ఇతర సురక్షిత మార్గాల్లో ఉంచాలి.

పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగ్రత్త

అత్యవసర అవసరాలకు సరిపడా డబ్బు పక్కన పెట్టిన తర్వాతే మిగిలిన మొత్తాన్ని పెట్టుబడులకు మళ్లించాలి. స్వల్పకాలిక అవసరాలున్నవారు తక్కువ వ్యవధి డెట్ ఫండ్లను పరిశీలించవచ్చు. దీర్ఘకాలిక లక్ష్యాలున్నవారు తమ రిస్క్ సామర్థ్యం, పెట్టుబడి వ్యవధిని బట్టి ఇతర పథకాలను ఎంచుకోవచ్చు. అయితే డెట్ మ్యూచువల్ ఫండ్లు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లు కావు. వాటి రాబడికి హామీ ఉండదు. వడ్డీ రేట్లు, క్రెడిట్ రిస్క్ కారణంగా పెట్టుబడి విలువలో మార్పులు రావచ్చు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
8 నవంబర్ 2026




తొలిసారి కాబోయే భార్యతో సాయి దుర్గాతేజ్.. మెగా హీరో పోస్ట్ వైరల్

మెగా కుటుంబంలో పెళ్లి సందడి మొదలైంది. చిరంజీవి మేనల్లుడు, హీరో సాయిదుర్గా తేజ్ కిరణ్ నిశ్చితార్థం ఘనంగా జరిగింది. నవంబరు 5న హైదరాబాద్‌లోని హిల్టన్ హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుకను నిర్వహించారు. కొణిదెల, అల్లు కుటుంబ సభ్యులు ఈ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. మెగాస్టార్ చిరంజీవి, సురేఖ కొణిదెల, రామ్‌చరణ్, అల్లు అర్జున్, స్నేహారెడ్డి, అల్లు బాబీ, నీలా షా, వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి, వారి కుమారుడు వాయువ్ తేజ్ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఎంగేజ్‌మెంట్‌కు సంబంధించిన ఫోటోలను రామ్ చరణ్‌తో పాటు మెగా హీరోలంతా సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వీరి పెళ్లి విషయం బయటకు తెలిసింది. అయితే సాయిదుర్గా తేజ్ మాత్రం నిశ్చితార్థం రోజు ఎలాంటి ఫోటోలను షేర్ చేయలేదు. దీంతో ఆయన కాబోయే భార్యను ఎలా పరిచయం చేస్తాడా అనే ఆసక్తి మెగా అభిమానుల్లో నెలకొంది. ఎట్టకేలకు నేడు తన ప్రేమ, పెళ్లి విషయాన్ని అధికారికంగా తెలియజేస్తూ.. 'ఐ లవ్ యూ' అంటూ ఎంగేజ్‌మెంట్‌లో కిరణ్‌తో కలిసి దిగిన ఫోటోని షేర్ చేశాడు. ఇలా సింపుల్ ప్రేమలేఖతో తన ప్రేమ, పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించాడు. కాగా, కిరణ్, సాయిదుర్గా తేజ్ కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారు. వీరిద్దరి చిన్నప్పటి నుంచి పరిచయం ఉంది. మొదట్లో స్నేహితులుగా ఉన్న వీరిద్దరు..కొన్నాళ్ల తర్వాత ప్రేమలో పడ్డారు. పెద్దల అంగీకారంతో ఇప్పుడు పెళ్లికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

పెళ్లి డేట్ ఫిక్స్..


ఎంగేజ్‌మెంట్ తర్వాత సాయిదుర్గా తేజ్ పెళ్లి డేట్‌పై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి. తాజాగా పెళ్లి డేట్‌ని అధికారికంగా ప్రకటిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 10న హైదరాబాద్‌లో వీరి వివాహం జరగనుంది. ఈ వేడుకకి మెగా ఫ్యామిలీతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు.



ఏడేళ్ల తర్వాత తమిళంలో నటిస్తున్నా.. 'ఓం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మమ్ముట్టి!


మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి శుక్రవారం జరిగిన 'ఓం' ప్రీ-రిలీజ్ వేడుకలో తనదైన శైలిలో మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సినిమా విశేషాలను పంచుకుంటూ సరదాగా, అదే సమయంలో ఆసక్తికరంగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'పేరన్బు' చిత్రం తర్వాత సరిగ్గా ఏడేళ్లకు తాను మళ్లీ ఒక తమిళ సినిమా చేస్తున్నానని మమ్ముట్టి తెలిపారు. ఆ సినిమా తర్వాత మరిన్ని మంచి తమిళ ప్రాజెక్ట్‌లు చేయాలని చాలా మందిని అడిగానని, కానీ ఎవరూ తనను పట్టించుకోలేదంటూ ఆయన చమత్కరించారు. అయితే, ఈ 'ఓం' సినిమా మాత్రం తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకంగా, గుర్తుండిపోయేలా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ.. సూపర్‌స్టార్ రజనీకాంత్, ధనుష్ వంటి దిగ్గజ నటులతో కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. "ఇప్పుడు నా పక్కనే ధనుష్ కొడుకు ఉన్నాడు, వాడు ఎప్పుడు సినిమాల్లోకి వచ్చి నటిస్తాడో నాకైతే తెలియదు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. ఈ చిత్ర కథాంశం గురించి మాట్లాడుతూ.. ఇందులో ఎన్నో వైవిధ్యమైన భావోద్వేగాలు ఉన్నాయని తెలిపారు. సామాన్య ప్రజల జీవితాలతో ముడిపడిన కొండ ప్రాంతపు నేపథ్యం, సాయిపల్లవి పాత్ర, ధనుష్ పాత్ర.. ఇలా ఎన్నో కథలు ఈ చిత్రంలో ఉన్నాయని, అయితే సినిమా కథను మాత్రం తాను ఇప్పుడే పూర్తిగా రివీల్ చేయబోనని స్పష్టం చేశారు. షూటింగ్ అనుభవాలను వివరిస్తూ.. ఈ సినిమా షూటింగ్ కేవలం 45 రోజుల్లో పూర్తవుతుందని మొదట్లో తనకు చెప్పారని, కానీ అది కాస్తా ఆరు నెలలకు పైగా సాగిందని చెప్పారు. ఇందులో స్మగ్లర్ నేపథ్యంలో సాగే ఘట్టాలు ఉండటంతో చాలా వరకు రాత్రిపూటే షూటింగ్ చేయాల్సి వచ్చిందని సరదాగా గుర్తుచేసుకున్నారు. తన ప్రసంగం ఎప్పుడూ సరదాగా నవ్వులు పంచేలా ఉంటుందని, కానీ ఈ సినిమా మాత్రం అందుకు పూర్తిగా భిన్నంగా ఎంతో సీరియస్‌గా ఉంటుందని మమ్ముట్టి తెలిపారు.

2026లోనూ నో రిలీజ్.. మరి ఇంకెప్పుడు?



తెలుగులో చాలామంది హీరోలున్నారు. వీళ్లలో స్టార్ హీరోలని పక్కనబెడితే కొందరు మిడ్ రేంజ్ హీరోలకు ప్రేక్షకుల్లో మంచి ఆదరణే ఉంది. కానీ అందుకు తగ్గట్లు వాళ్లు సినిమాలు తీయట్లేదు. తీసినా సరే అవి థియేటర్లలో రిలీజ్ కావట్లేదు. అలాంటి ఓ చిత్రమే 'స్వయంభు'. నిఖిల్ హీరో. ఇంతకీ ఈ మూవీ ఏమైంది? రిలీజ్ చేస్తారా చేయరా? స్వామి రారా, కార్తికేయ, ఎక్కడిపోతావు చిన్నవాడ సినిమాలతో హిట్స్ కొట్టిన నిఖిల్.. 'కార్తికేయ 2'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ క్రమంలోనే 'స్వయంభు' అనే పాన్ ఇండియా సినిమాని మూడునాలుగేళ్ల క్రితం ప్రకటించాడు. 2023 ఆగస్టులోనే దీని షూటింగ్ మొదలైంది. ఇప్పటికి మూడేళ్లు గడిచిపోయాయి గానీ సదరు చిత్రం రిలీజ్ జాడలేకుండా పోయింది. ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందో తెలియని పరిస్థితి. ఈ ఏడాది ఫిబ్రవరిలో శివరాత్రికే 'స్వయంభు' రిలీజ్ చేసేస్తామని ప్రమోషన్లతో టీమ్ హడావుడి చేశారు. టీవీ షోల్లో పాల్గొని, పలు ఇంటర్వ్యూలు ఇచ్చారు. కానీ వాయిదా పడింది. వేసవికి వచ్చేస్తామని అన్నారు కానీ అదీ జరగలేదు. తర్వాత నుంచి టీమ్ సైలెంట్ అయిపోయింది. ఇప్పుడు నవంబరు నెల. మరో 50 రోజుల్లో 2026 పూర్తవుతుంది. ప్రాక్టికల్‌గా చూస్తే ఈ ఏడాదిలో రిలీజ్ అసాధ్యం. పోనీ వచ్చే ఏడాది వద్దామనుకుంటే సంక్రాంతి సీజన్ ఇప్పటికే ఫుల్ అయిపోయింది. ఫిబ్రవరి, మార్చి, ఆపై వేసవి బెర్తులు నిండిపోతున్నాయి. మరి 'స్వయంభు' ఎప్పుడొస్తుందో ఏంటో?

'కార్తికేయ 2' హిట్ కాకముందు వరకు నిఖిల్ చేసిన సినిమాలు తెలుగులోనే రిలీజ్ అయ్యేవి. ఎప్పుడైతే ఈ పాన్ ఇండియా గోలలో పడ్డాడో అప్పటినుంచి రెగ్యులర్‌గా కనిపించకుండాపోయాడు. సాధారణ ప్రేక్షకులు చాలామంది ఇతడిని మర్చిపోయారు! 'స్వయంభు' కాకుండా రామ్ చరణ్ నిర్మాతగా 'ద ఇండియన్ హౌస్' అని ఓ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు. అది ఉందో లేదో? 'స్వయంభు' రిలీజ్‌తో పాటు తన సినిమాలపై క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం నిఖిల్‌కి ఎంతైనా ఉంది!



ఈ ఏడాది హ్యాట్రిక్ హిట్స్.. 'సీన్' కలెక్షన్ ఎంత?

ఈ ఏడాది సూర్య నామసంవత్సరంగా సాగుతుంది. ఎందుకంటే వేసవిలో ఓ సినిమాతో, వర్షాకాలంలో మరో మూవీతో.. ఇప్పుడు చలికాలంలో మరో చిత్రంతో వచ్చి వరసగా హిట్స్ కొట్టాడు. మరి లేటెస్ట్‌గా వచ్చిన 'సీన్'కి ప్రేక్షకుల నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది? తొలిరోజు కలెక్షన్ ఎన్ని కోట్లు వచ్చాయ్? 'ఆవేశం' లాంటి క్రేజీ మూవీ తీసిన దర్శకుడు జీతూ మాధవన్.. హీరో సూర్యతో కలిసి చేసిన తమిళ మూవీ 'సీన్'. నజ్రియా హీరోయిన్ కాగా నస్లేన్ విలన్‌గా చేశాడు. ప్రమోషనల్ కంటెంట్‌తోనే బజ్ వచ్చేలా చేశారు. సినిమా కూడా అందుకు తగ్గట్లే అదిరిపోయింది. అటు తమిళం, ఇటు తెలుగు నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. కామెడీ క్రైమ్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిన ఈ చిత్రం చాలామందిని అలరిస్తోంది. ఇకపోతే తొలిరోజు ఈ సినిమాకు రూ.19.15 కోట్ల నెట్ కలెక్షన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. తమిళం నుంచి రూ.16.15 కోట్లు రాగా తెలుగు నుంచి రూ.3 కోట్ల మొత్తం రాబట్టినట్లు సమాచారం. ప్రస్తుతానికి టాక్ బాగుంది. దీపావళి సెలవులు కూడా కలిసొచ్చాయి కాబట్టి వీకెండ్ అయ్యేసరికి వసూళ్లు పెరిగే అవకాశముంది.

'సీన్' విషయానికొస్తే.. క్రైమ్ బ్రాంచ్‌లో డీఎస్పీగా పనిచేసే ప్రేమ్ రాజ్ (సూర్య) తన తెలివి తేటలతో క్లిష్టమైన కేసులను ఈజీగా సాల్వ్ చేస్తుంటాడు. సీరియల్ కిల్లర్ విక్టర్ (టోవినో థామస్)ను అరెస్ట్ చేసిన తర్వాత తన ఉద్యోగానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకుంటాడు. అది పెండింగ్‌లో ఉండగానే నగరంలో వరుస హత్యలు జరుగుతుంటాయి. అవన్నీ సీరియల్ కిల్లర్ విక్టర్ చేసిన మర్డర్స్ మాదిరే ఉంటాయి. విక్టర్ జైల్లో ఉంటే బయట ఆ హత్యలు ఎవరు చేస్తున్నారనేది మిస్టరీగా మారుతుంది. అదే సమయంలో ప్రేమ్ సంబంధించిన ఓ సంచలన నిజం క్రైమ్ బ్రాంచ్ చీఫ్ స్టీఫెన్‌కి తెలుస్తుంది. దీంతో విక్టర్‌ని ఉద్యోగం నుంచి తప్పిస్తాడు. అయినప్పటికీ సీరియల్ కిల్లర్ కేసుని ప్రేమ్ సవాల్‌గా తీసుకుంటాడు. మాయ(నజ్రియా) సాయంతో ఈ కేసులను విచారిస్తుంటాడు. అసలు ఆ హత్యలు చేస్తున్నదెవరు? ప్రేమ్ ఆ సీరియల్ కిల్లర్‌ని ఎలా పట్టుకున్నాడు? పై అధికారుల దగ్గర ప్రేమ్ దాచిన నిజం ఏంటి? ప్రేమ్‌కు ఉన్న సమస్య ఏంటి? ఈ కేసు విచారణలో ప్రేమ్‌కి మాయ ఎలాంటి సహాయం చేసింది? ఈ కథలో ఈశ్వరన్ (నస్లేన్) పాత్ర ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001. Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184. Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.